

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
మంగళవారం 19 మార్చి 2024



జలగండం

- వేసవి రాకముందే ప్రమాద ఘంటికలు
- రోజురోజుకూ అడుగంటిపోతున్న భూగర్భ జలాలు
- మొక్కజొన్నకు గడ్డు పరిస్థితి
- కాల్వల్లో చుక్కనీరు లేదు.. బోర్లు వేస్తే నీరు రాదు
- కృష్ణా తీరంలో తాగునీటికీ కష్టాలు
- ట్యాంక్ నిండాలంటే మోటర్ పూటంతా ఆడాల్సిందే..




భూగర్భ జలాలు పడిపోవటంతో విద్యుత్తు మోటారు నుంచి చిన్నపాటి ధారగా వస్తున్న నీరు

ఇప్పుడిప్పుడే ఎండ వేడి పెరుగుతుంటే, దీనికి తగ్గట్టుగానే భూగర్భ జలాలు కూడా రోజుకో విధంగా అడుక్కుపోతున్నాయి. పచ్చని పైర్లతో కళకళలాడే కృష్ణా తీరంలోనూ గుక్కెడు నీరు బయటకు తోడాలంటే గగనమైపోతోంది. డెల్టాలో రబీ పంటలకు నీటి కష్టాలు తప్పటం లేదు. మొక్కజొన్న చేలల్లో కూడా నేల నెర్రెలిస్తోంది. కొన్నిచోట్ల పంట ఎండుతుంటే, దిగుబడులపై ప్రభావం పడుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మరోపక్క ఒక ఎకరా చేను తడపటానికి రోజంతా మోటర్ వదిలితేనే అంతంతమాత్రంగా ఉంటోంది. ఒక్క గంటకూడా వదలకుండా పది రోజులుగా మొక్కజొన్నకు తడులు పెట్టేందుకు మోటార్లను ఆడిస్తూనే ఉండటంతో చివరకు కృష్ణా నదికి పక్కనే ఉన్నగ్రామాల్లోనూ తాగునీటికి కటకట ఏర్పడింది. పంపులు నీరు రాక మొరాయిస్తున్నాయి. అత్యంత వేగంగా నీటిని లాగే మోటార్లు మినహా, సాధారణ మోటార్లు ఉన్నవారికి రోజంతా మోటర్ వేసినా ట్యాంక్ నిండని పరిస్థితి. పుష్కలంగా నీరు ఉండే డెల్టా ప్రాంతం పరిస్థితే ఇలా ఉంటే, పలనాడు జిల్లాలో పరిస్థితి ఇంకా ఎంత ఘోరంగా ఉందో అని డెల్టా ప్రజలు మాట్లాడుకోవడం కనిపిస్తోంది.

తెనాలి, మార్చి 18, (ఆంధ్రజ్యోతి): గుంటూరు డివిజన్‌లో గత ఏడాది ఫిబ్రవరిలో 4.29 మీటర్ల లోతులో భూగర్భ జలాలుంటే, ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో రెండు సంవత్సరాల హెచ్చుతగ్గుల వ్యత్యాసం -0.70 మీటర్లకు పడిపోయింది. ఇటు తెనాలి డివిజన్‌లోనూ 2023 ఫిబ్రవరి నాటికి 4.29 మీటర్ల లోతులో నీరు అందుబాటులో ఉంటే, ఈ రెండు సంవత్సరాల్లోని ఫిబ్రవరి నెల హెచ్చుతగ్గులు చూస్తే -0.58 మీటర్ల లోతుకు పడిపోయింది. బాపట్ల జిల్లాలో మొత్తం 30 చోట్ల భూగర్భ జలమట్టాలను పరిశీలిస్తే, గతేడాది ఫిబ్రవరిలో 1.61 మీటర్ల లోతులో నీరు సగటున అందుబాటులో ఉంది. అయితే గత సంవత్సరం ఫిబ్రవరి, ఈ సంవత్సరం ఫిబ్రవరి హెచ్చుతగ్గుల ప్రకారం చూస్తే -0.04 మీటర్ల వరకు దిగిపోయింది. మండలాలవారీగా చూస్తే, కొన్ని మండలాల్లో అయితే -1.13 మీటర్ల నుంచి -1.98 మీటర్ల లోతుకు నీటి మట్టం పడిపోయింది. ఇప్పుడే ఇంతటి దారుణ పరిస్థితులు నెలకొంటే, రేపటి వేసవి తీవ్రతకు చుక్కనీరు దొరకుతుందా! అనే భయం మొదలయింది.

అడుగంటుతున్న భూగర్భ జలాలు

2023 ఫిబ్రవరి నెల, ఈ ఏడాది ఫిబ్రవరి నెల మధ్య భూగర్భ జలాల హెచ్చుతగ్గులను పరిగణనలోకి తీసుకుంటే, గుంటూరు జిల్లాలోని గుంటూరు వెస్ట్ నియోజకవర్గ పరిధిలో అత్యధింగా -1.57 మీటర్లమేర నీటిమట్టం పడిపోతే, తెనాలిలో -0.64 మీటర్లు, పొన్నూరు పరిధిలో -0.52, మంగళగిరి పరిధిలో -0.58, కొల్లిపరలో -0.52, దుగ్గిరాల పరిధిలో -0.20 మీటర్ల లోతుకు పడిపోయింది. ఇటు బాపట్ల జిల్లాలోని కృష్ణా తీరంలో భారీగానే నీటి నిల్వలు అడుకుగు చేరాయి. అమృతలూరు మండలంలో -1.98 మీటర్లు, బాపట్ల పరిధిలో -1.59, భట్టిప్రోలు, వేమూరు ప్రాంతంలో -1.16, పరిధిలో -1.13, కొల్లూరు పరిధిలో -0.91 మీటర్ల మేర నీటి మట్టం లోతుకు పోయింది. కృష్ణా తీరంలో సాధారణంగా భూగర్భ జలాలు మైనస్ స్థాయికి పడిపోకుండా, కొంతమేరయినా అందుబాటులోనే ఉండేవి. కానీ వర్షపాతం తగ్గిపోవటం, ఇసుక తవ్వకాలు ఈ ప్రాంత వాసులకు శాపంగా మారాయి. ఏటా సాధారణంగా నమోదు కావలసిన వర్షపాతాలు కూడా భారీగానే పడిపోయాయి. 2020లో మాత్రమే సాధారణ వర్షపాతానికి మించి వర్షం పడింది. సాధారణంగా ఈ జిల్లాల్లో 9.50 మి.మీటర్ల వర్షపాతం నమోదు కావలసి ఉంటే, 2020లో సగటున 12.50 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయింది. 2021లోనూ 3.50 మి.మీటర్ల వర్షపాతం నమోదయింది. 2022లో వర్షపాతం మాత్రమే 0.1 మిల్లీ మీటర్లు నమోదయితే, నీటి మట్టాలు మాత్రం 3.36 మీటర్లకు పెరిింది. ఆ సమయంలో కృష్ణా నదికి, కాల్వలకు నీరు రావటంతో నీటి మట్టాలు పెరిగాయి. 2023లోనూ 0.10 మి.మీటర్లు మాత్రమే వర్షపాతం నమోదయింది.

తీరంలోనూ తాగునీటి కష్టాలు..

చుండూరు మండలం చినగాదెలవర్రులో అయితే మొక్కజొన్న పంటను కాపాడుకునేందుకు నీరందక, నేలపై భాగంలో అమర్చిన మోటార్లను తీసేసి, ఐదు నుంచి పది అడుగుల లోతులో గుంతలు తీసి, వాటిలో బోర్లకు అమర్చుతున్నారు. గత వారం నుంచి ఈ పరిస్థితి మరీ ఎక్కువయింది. కొల్లిపర, తెనాలి, వేమూరు, అమృతలూరు, భట్టిప్రోలు, కొల్లూరు మండలాల్లోనూ ఇదే పరిస్థితి. అటు అమృతలూరు మండలంలోనూ గతంలో చూడని నీటి కరువును చూస్తున్నామని, ఇంటి దగ్గర పంపులు పనిచేయటంలేదని, మోటార్లు వేసినా నీరు రావటంలేదని, చేసేదిలేక పది నుంచి 15 అడుగుల లోతులో గుంతలు తీసి, అదే బోర్లను కత్తిరించి అక్కడ మోటార్లు అమర్చాల్సి వస్తోందని స్థానికులు చెబుతున్నారు. మరోపక్క కృష్ణా తీరంలోని లంక గ్రామాల్లో వాణిజ్య పంటలకూ నీటి కష్టాలు తప్పటంలేదు. గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలోని మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాల, కొల్లిపర, కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె మండలాల పరిధిలోని లంకగ్రామాల్లో అరటి, చెరుకు,తమలపాకు,కంద,మొక్కజొన్న,పసుపు వంటి వాణిజ్య పంటలు సాగులో ఉన్నాయి. వీటికీ నీటి తడులు అందించటానికి రైతులు నానా తంటాలు పడుతున్నారు. ఇప్పటికే మోటార్లు భూమిలో పది నుంచి 15 అడుగుల లోతు గోతులు తీసి, వాటిలో పల అమర్చితే, ఇప్పుడు వాటికి కూడా నీరు అందటంలేదు. ఎకరా పొలానికి నీరందించటానికి రెండు రోజులు పడుతోందని రైతులు చెబుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే ఏప్రిల్, మేనెలల్లో చుక్కనీరు అందదని, రైతులు భయపడుతున్నారు. అటు తీరంలో నూ తాగునీటికి ఇక్కట్లు తప్పేలా లేదు.

ఉమ్మడి గుంటూరు జిల్లాలో భూగర్భ జలాలు అడగంటిపోతున్నాయి. గత రెండు సంవత్సరాల సగటుతో పోల్చితే ఈ సంవత్సరం అప్పుడే నీరు అడుగుకు చేర టం కలవర పెడుతున్న అంశం. వర్షపాతం తగ్గిపోవటం, కృష్ణా తీరంలో మితిమీరిన ఇసుక తవ్వకాలు, కాల్వలకు సరిపడా నీరు అందక రబీ పంట కోసం భూగర్భ జలాలపై ఆధారపడటంతో సమస్య మరింత జటిలమైపోతోంది. జనవరి, ఫిబ్రవరిలో తీసుకున్న భూగర్భ జలమట్టాలే మైనస్ స్థాయికి పడిపోతే, ఈ మార్చి, రానున్న నెలల్లో పరిస్థితి ఇం కెంత గడ్డుగా మారనుందనేది అంతుబట్టని విషయం.


● అమృతలూరులో బోరుకు పక్కనే గొయ్యి తీసి మోటారు అమర్చిన చిత్రం

రబీ పంటకు గడ్డు కాలం

కృష్ణా డెల్టాలోని బాపట్ల, గుంటూరు, ప్రకాశం జిల్లా పరిధిలో రబీ సాగుకింద 4.5 లక్షల ఎకరాలకు పైగా మొక్కజొన్న సాగు చేశారు. ఇప్పుడు పంట చాలావరకు కంకి దశలో, కండె గింజ వృద్ధి చెందే దశలో ఉంది. అయితే దీనికి నీరు అందని పరిస్థితి. కృష్ణానది నుంచి ఖరీఫ్‌కు సరిపడా నీరు కాల్వలకు అందేలా నిండుగా వదిలితే, రబీలో పంటకు మాత్రం కాల్వల అడుగున పారుదల అయ్యేలా వదిలేశారు. ఆ నీటినే ఆయిల్ ఇంజన్‌లు, మోటార్ల సాయంతో రైతులు తడులు పెట్టుకునేవారు. అయితే ఈ సారి డెల్టా కాల్వలకు చుక్కనీరు ఇవ్వలేని పరిస్థితి. జలాశయాల్లో నీరు అడుగుకు చేరితే, ఇటు రబీ పంటకు నీరిచ్చేటంత అవకాశాలు లేకుండాపోయాయి. పులిచింతల నీరు తాగునీటికి మాత్రమే ఉపయోగించాలి. ఇటు బ్యారేజికి నీరు వచ్చిచేరే అవకాశాలు లేకపోవటంతో కాల్వలకు నీటిని వదలటంలేదు. కనీసం సముద్రతీర మండలాల్లో తాగునీటి చెరువులు నింపుకొనేందుకు కూడా నీరు ఇవ్వలేని దయనీయ పరిస్థితి. పక్షం రోజుల క్రితం కొన్ని కాల్వలకు నీరు వదిలామనిపించి, ఎవరిని అప్రమత్తం చేయకుండా, చెరువులకు నీటిని నింపుకునే అవకాశం లేకుండా రోజుల వ్యవధిలోనే నీటిని కట్టేశారు. దీంతో తాగునీటికీ కటకట ఏర్పడింది. ఇటు కృష్ణానదికి ఎగువన ఉన్న మండలాల్లోనూ భూగర్భ జలాలు అడుగంటటం, మొక్కజొన్న పంటను కాపాడుకునేందుకు నీటిని తోడేస్తుండటంతో ఈ ప్రాంతాల్లోనూ పంపులు మొరాయించాయి. ఒక్కఎకరం మొక్కజొన్నకు నీరు పెట్టాలంటే రెండు రోజులుపైనే పట్టటం, పగలు నీరు పెద్దగా అందకపోవటంతో అంతా రాత్రి సమయాల్లో మోటార్లు ఆడిస్తున్నారు. ఇటు గృహ అవసరాలకోసం వేసే మోటార్లు కూడా సమయాలు చూసుకుని వెయ్యాల్సిన పరిస్థితి. వెయ్యి లీటర్ల సామర్థ్యం ఉన్న నీటి ట్యాంక్ నిండటానికి సాధారణంగా అర్థగంటలోపు సమయం పడితే, ఇప్పుడున్న పరిస్థితుల్లో గంటన్నర నుంచి రెండు గంటల వరకు పడుతోంది. సబ్‌మెర్సిబుల్, జెట్ మోటార్లున్నవారు ఒకసారి ట్యాంక్ నిండటానికి రెండు నుంచి 5 నిముషాలు మోటార్లు ఆడించేవారు. ఇప్పుడు అవికూడా 15 నిముషాల నుంచి అర్థగంట వరకు సమయం పడుతోందంటున్నారు.


● చిన గాదెలవర్రులో గోతులు తీసి దానిలో మోటార్లు అమర్చుతున్న చిత్రం



పగడ్బందీగా పది పరీక్షలు

- పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ శివశంకర్ లోతేటి

నరసరావుపేట రూరల్, మార్చి 18: పల్నాడు జిల్లాలో పదో తరగతి పరీక్షలు పగడ్బందీగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. నరసరావుపేట మండలం లింగంగుంట్ల గ్రామంలోని శంకరభారతిపురం హైస్కూలులోని పదోతరగతి పరీక్ష కేంద్రాన్ని సోమవారం కలెక్టర్ శివశంకర్ లోతేటి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా హైస్కూలు ప్రధానోపాధ్యాయురాలు పార్వతికి, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

నియమావళిని అతిక్రమిస్తే కేసులు

- కలెక్టర్ శివశంకర్


సమావేశంలో మాట్లాడుతన్న కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట, మార్చి 18 : ఎన్నికల ప్రవర్తన నియమావళిని అతిక్రమిస్తే అటువంటి వారిపై కేసులు నమోదు చేస్తామని కలెక్టర్ శివశంకర్ లోతేటి స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారులు మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయిన నేపథ్యంలో జిల్లాలో నియమావళిని పగడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. వలంటీర్లు ఎవరైనా ఎన్నికల విధులలో ఉన్నట్లయితే వారిని విధుల నుండి తొలగించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ కార్యాలయాలలో ఉన్న పోస్టర్లను వెంటనే తొలగించాలని చెప్పారు. ఎన్నికల నియమావళి అమలులో ఒక్క శాతం వ్యత్యాసం కూడా ఉండకూడదన్నారు. పత్రికలలో వచ్చే ప్రతికూల వార్తలపై ఎప్పటికప్పుడు నివేదికలు రూపొందించి తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. సీ విజిల్ యాప్ లో ప్రతి ఒక్కరు డౌన్లోడ్ చేసుకోవాలని సి విజిల్ యాప్ లో వచ్చిన అంశాలను 100 నిమిషాల్లో సంబంధిత అధికారుల ద్వారా పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా సీ విజిల్ నోడల్ అధికారి రామకృష్ణ యాప్ పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేసి అవగాహన కల్పించారు. సీ విజిల్ ఉపయోగాన్ని అందరికీ తెలియజేయవలసిన అవసరం ఉందన్నారు. ప్రతి రిటర్నింగ్ అధికారి వారి కార్యాలయం ఎక్కడుందో సైన్ బోర్డులను ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఎన్కోర్ యాప్ పై సవి వరంగా వివరించారు. పెండింగ్‌లో ఉన్న ఫారాలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (సాయంత్రం) 6.24(మంగళవారం)
సహేరీ (ఉదయం) 4.56 (బుధవారం)



కోడ్ ఉల్లంఘనా.. సీవిజిల్ ఉందిగా..



- రియల్‌టైంలో ఫోటో/వీడియో/ఆడియో పంపించే అవకాశం
- 100 నిమిషాల్లో తీసుకొన్న చర్య గురించి ఈసీఐ నుంచి సమాధానం

గుంటూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ ప్రకటనతో జిల్లా వ్యాప్తంగా ఎలక్షన్ కోడ్ అమలులోకి వచ్చిన దృష్ట్యా మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ ఉల్లంఘనలపై ఎవరికి ఫిర్యాదు చేయాలనే దానిపై ప్రజల్లో అయోమయం నెలకొని ఉన్నది. కలెక్టరేట్‌లో టోల్ ఫ్రీ నెంబరుని ఏర్పాటు చేసినప్పటికీ వాటికి ఫిర్యాదు చేసేందుకు చాలామంది సంశయిస్తుంటారు. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం స్మార్ట్‌ఫోన్ వినియోగదారులకు సీవిజిల్ యాప్‌ని అందుబాటులోకి తీసుకొచ్చింది. మొబైల్ నెంబరు, పేరు, చిరునామా తదితర వివరాలు నమోదు చేసి లాగిన్ అయి కళ్ల ముందు జరుగుతున్న ఎన్నికల కోడ్ ఉల్లంఘనలను ఫోటో/వీడియో/ఆడియో ద్వారా రికార్డింగ్ చేసి నివేదించ వచ్చు. ఒక వ్యక్తి ఎన్ని ఫిర్యాదులైనా సీవిజిల్ ద్వారా పంపిం చే సదుపాయం ఉన్నది. అలాగని తప్పుడు ఫిర్యాదులు చేయ డానికి వీల్లేదు.

ఎన్నికల్ కోడ్ ఉల్లంఘనలపై చర్యలు తీసుకొనేందుకు ఎలక్షన్ కమిషన్ ప్రత్యేకించి సీవిజిల్ యాప్‌ని రూపొందించింది. స్మార్ట్‌ఫోన్ వినియోగదారులు ప్లేస్టోర్ నుంచి దీనిని డౌన్‌లోడ్ చేసుకొని ఉల్లంఘనలపై ఒక అస్త్రంగా వినియోగిం చవచ్చు. ఓటరు ఫిర్యాదుని పంపగానే ఆ సమాచారం కలెక్ట రేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంలో ప్రతిధ్వనిస్తుంది. దానిని ఫీల్డ్ యూనిట్‌కి ఐదు నిమిషాల వ్యవధిలోనే పంపు తారు. ఫీల్డ్ యూనిట్‌లో ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వైలెన్స్ టీం, రిజర్వు టీంలు ఉంటాయి. ప్రతీ ఫీల్డ్ యూనిట్‌కి జీఐఎస్ ఆధారిత సీవిజిల్ ఇన్వెస్టిగేటర్ మొబైల్ యాప్ ఉంటుంది. అది నేరుగా ఫిర్యాదు ఏ ప్రాంతం నుంచి వచ్చిందో అక్కడికి చేరుకొనే మార్గం చూపిస్తుంది. ఫీల్డ్ యూనిట్ తీసుకొన్న చర్యని ఇన్వెస్టిగేటర్ యాప్ ద్వారా సంబంధిత రిటర్నింగ్ అధికారికి పరిష్కారం కోసం పంపుతారు. అంతా సవ్యంగా ఉంటే ఆ సమాచారాన్ని జాతీయ గ్రీవియన్స్ పోర్టల్‌కి కేంద్ర ఎన్నికల సంఘం తదుపరి చర్యలకు పంపుతారు. ఈసీ తీసుకొన్న చర్యని 100 నిమిషాల వ్యవధిలోనే పౌరుడికి తెలియజేస్తారు. ఈ దఫా ఎన్నికల్లో ఇదొక విప్లవాత్మకం కానుంది.

సీవిజిల్ వినియోగదారుడు ఫోటో/వీడియో/ఆడియోని రికార్డు చేయగానే దానిని ఫిర్యాదు చేయడానికి ఐదు నిమిషాల సమయం ఉంటుంది. గతంలో తీసిన ఫోటోలు, వీడియోలను అప్‌లోడింగ్ చేయడానికి యాప్ అనుమతించదు. అలానే తీసిన ఫోటోలు, వీడియోలు, ఆడియోలను గ్యాలరీలో స్టోర్ చేసుకొనేందుకు కూడా అవకాశం ఇవ్వదు. తప్పుడు ఫిర్యాదులను డ్రాప్ చేసే అధికారం జిల్లా కలెక్టర్‌కి ఉంటుంది. మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్‌కి సంబంధించిన ఫిర్యాదు కాకపోతే దానిని ఈసీఐ ప్రధాన వెబ్‌సైట్/1950 టోల్‌ఫ్రీ నెంబరుకు ఫిర్యాదు చేసే అవకాశాన్ని కల్పించారు.

కోడ్ ఉల్లంఘనలు

- నరసరావుపేట ప్రభుత్వ భవనాలపై ఇంకా వైసీపీ రంగులు
- విద్యుత్ స్థంభాలు, స్వాగత ద్వారాలపై కూడా...
- గోడలపై వైసీపీ ప్రచార ఫ్లెక్సీలు
- తురకపాలెం సచివాలయంలో వైసీపీ నేతల సమావేశం
- ముస్లిం రిజర్వేషన్‌పై అభిప్రాయాల సేకరణ



నరసరావుపేటలో అర్బన్ హెల్త్ సెంటర్ భవనానికి వైసీపీ రంగులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నరసరావుపేటలో ఎన్నికల నియమావళిని అమలు చేయడంలో అధికారులకు చిత్తశుద్ధి కొరవడింది. పట్టణంలో ప్రభుత్వ భవనాలు, విద్యుత్ స్థంబాలు, స్వాగత ద్వారాల దిమ్మె లపై ఇంకా వైసీపీ రంగులు ఉన్నాయి. కోడ్ అమలులోకి వచ్చి రెండు రోజులు గడిచినా వీటిని తొలగించడంలో మునిసిపల్ అధికారులు పట్టీపట్టనట్టు వ్యవహరిస్తున్నారు. జగన్‌కు సంబంధించిన బోర్డులో ఎక్కడ పడితే అక్కడ ఉన్నాయి. వెంకటరెడ్డి నగర్‌లో అర్బన్ హెల్త్‌సెంటర్‌పై ఇంకా వైసీపీ రంగులున్నాయి. కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మించిన ఈ భవనానికి అధికారులు వైసీపీ రంగులు వేశారు. ఎన్నికల నియమావళి అమలు లోకి వచ్చినా ఈ భవనానికి ఉన్న వైసీపీ రంగులను తొల గించే ప్రయత్నాలు చేయడంలేదు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ స్థంభాలు, స్వాగత ద్వారాలపై కూడా వైసీపీ రంగులు కనిపిస్తున్నాయి. మునిసిపాలిటీలో ఎన్నికల కోడ్‌ను అమలు చేయాల్సిన అధికారులు వైసీపీ రంగుల విషయంలో చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వైసీపీ అభ్యర్థులకు సంబంధించిన ఫ్లెక్సీలను పట్టణంలో పెద్ద ఎత్తున ఏర్పాటు చేశారు. వీటిని ఎక్కడపడితే అక్కడ గోడలకు అంటించారు. అనుమతిలేని ఫ్లెక్సీలను తొలగించాలని ఎన్నికల కమిషన్ ఆదేశించినా సదరు అధికారులు ఇంకా స్పందించలేదు. ఫ్లెక్సీల విషయంలో అధికారుల తీరు విమర్శలకు దారితీస్తోంది ఇంకా కొందరు అధికారులు వైసీపీకి అనుకూలంగా పనిచేస్తున్నారన్న అరోపణలున్నాయి. కోడ్ అమలు చేయాలని అధికారులపై ఎన్నికల కమిషన్ తక్షణమే చర్యలు తీసుకోవాలని రాజకీయ పార్టీల నేతలు డిమాండ్ చేస్తున్నారు.


తురకపాలెం సచివాలయంలో సమావేశం నిర్వహిస్తున్న వైసీపీ నాయకులు

సచివాలయంలో సమావేశం

గురజాల నియోజకవర్గం మాచవరం మండలంలోని తురకపాలెం గ్రామంలో వైసీపీ నాయకులు ఎన్నికల కోడ్‌ను యథేశ్చగా ఉల్లంఘించారు. ఆదివారం రాత్రి గ్రామంలోని సచివాలయంలో ముస్లిములతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల కోడ్ 16వ తేదీ నుండే అమలులోకి వచ్చినప్పటికీ 17వ తేదీ రాత్రి సచివాలయంలో వైసిపి నాయకులు సమావేశం ఏర్పాటు చేశారు. బీజేపీ ముస్లింలకు ఉన్న నాలుగు శాతం రిజర్వేషన్ ఎత్తివేస్తావంటున్నారంటూ, దీనిపై అభిప్రాయ సేకరణకు ముస్లిం పెద్దలతో సమావేశం నిర్వహించారు. అంతే కాకుండా వారందరితో సంతకాల సేకరణ కూడా చేశారు. ఎన్నికల కోడ్ అమలులో వున్నప్పటికీ ఏకంగా గ్రామ సచివాలయంలో సమావేశం నిర్వహించడంపై గ్రామస్తులు విస్మయానికి గురయ్యారు. తురకపాలెం గ్రామంలో నూటికి 99 శాతం మైనారిటీ వర్గానికి చెందిన వారే కావడంతో, బీజేపీ వారి రిజర్వేషన్ ఎత్తివేస్తుంది, అని నమ్మించే ప్రయత్నంలో భాగం ఈ సమావేశం జరిపారని, గ్రామస్తులు చర్చించు కుంటున్నారు. ఈ విషయంపై సచివాలయ కార్యదర్శి రామరాజును వివరణ కోరగా సమావేశం జరిగిన విషయం ఆరోజు తెలియలేదని, మరుసటిరోజు విషయం తెలియగానే సర్పంచ్‌తో మాట్లాడి ఇలాంటి సమావేశాలు సచివాలయంలో పెట్టకూడదని తెలిపామని అన్నారు.


తురకపాలెంలో ముస్లింల రిజర్వేషన్ ఉంచాలా తీసివేయాలా అనేదానిపై ప్రచారం నిర్వహిస్తున్న వైసీపీ నాయకులు

దిక్సూచి
DIKSUCHI

(నిన్నటి తరువాయి)

2. సవ్యదిశ అక్షరాలకు అపసవ్యదిశ(వ్యతిరేకదిశ) అక్షరాలు రాయడం:

ఉదా: ఒక సంకేత భాషలో FAMEను UZNVగా రాస్తే అదే సంకేతభాషలో HELPను ఏ విధంగా రాస్తారు?

ఎ) VSKO బి) SVOK
సి) OVSK డి) SOKV

సమాధానం: (బి)

వివరణ: FAMEను UZNVగా రాయడం అంటే
F అనేది 6వ అక్షరం.
U అనేది అపసవ్యదిశలో (చివరి నుంచి) 6వ అక్షరం.
A అనేది 1వ అక్షరం.
Z అనేది అపసవ్యదిశలో (చివరి నుంచి) 1వ అక్షరం.
M అనేది 13వ అక్షరం.
N అనేది అపసవ్యదిశలో (చివరి నుంచి) 13వ అక్షరం.
E అనేది 5వ అక్షరం.
V అనేది అపసవ్యదిశలో (చివరి నుంచి) 5వ అక్షరం.
ఈవిధంగా FAME ని UZNVగా రాశారు.
ఇదే విధంగా HELP అనే పదములో
H అనేది 8వ అక్షరం.
S అనేది అపసవ్యదిశలో (చివరి నుంచి) 8వ అక్షరం.
E అనేది 5వ అక్షరం.
V అనేది అపసవ్యదిశలో (చివరి నుంచి) 5వ అక్షరం.
L అనేది 12వ అక్షరం.
O అనేది అపసవ్యదిశలో (చివరి నుంచి) 12వ అక్షరం.
P అనేది 16వ అక్షరం.
K అనేది అపసవ్యదిశలో (చివరి నుంచి) 16వ అక్షరం.

3. పదంలోని అక్షరాలకు తదుపరి అక్షరాలుగా లేదా వెనక అక్షరాలుగా రాసి ప్రతి రెండు అక్షరాలను రివర్స్ చేయడం (క్రాస్ మెథడ్).

ఉదా 3: ఒక సంకేతభాషలో MEDIUMను FNJENVగా రాస్తే అదే సంకేతభాషలో INCOMEను ఏవిధంగా రాస్తారు?

ఎ) OPDFJN బి) JODPNF
సి) OJPDFN డి) JPOFDN

సమాధానము: (సి)

వివరణ: MEDIUMను FNJENVగా రాయడం అంటే MEDIUMలోని ప్రతి అక్షరానికి +1 అక్షరాన్ని రాసిన అంటే.. తదుపరి అక్షరాలుగా రాసిన NFEJVN. దీనిలోని ప్రతి రెండు అక్షరాలను రివర్స్‌లో రాసిన FNJENV అవుతుంది. ఇదే విధంగా INCOMEలోని ప్రతి అక్షరానికి తదుపరి అక్షరం రాసిన JODPNF దీనిలోని ప్రతి రెండు అక్షరాలను రివర్స్‌లో రాసిన సమాధానం OJPDFN అవుతుంది.

4. పదంలోని అక్షరాలనే స్థానాలను మార్పుచేసి రాయడం:

ఉదా: ఒక సంకేతభాషలో PRIVATEను ARPTIEVగా రాస్తే అదే సంకేతభాషలో MISTAKE ను ఏవిధంగా రాస్తారు?

ఎ) IASKMTE బి) AIMKSET
సి) MSKTIAE డి) ఏదికాదు.

సమాధానము: (బి)

వివరణ: PRIVATEను ARPTIEVగా రాయడం అనగా ఆ పదంలోని అక్షరాలనే స్థానాలను మార్పుచేసి రాశారు.

PRIVATEఅనే పదంలోని అక్షరాలకు 1 2 3 4 5 6 7 అనే సంఖ్యలను ఇచ్చిన ARPTIEV అనేది 5 2 1 6 3 7 4.

1 2 3 4 5 6 7 - 5 2 1 6 3 7 4
P R I V A T E - A R P T I E V
ఇదేవిధంగా
1 2 3 4 5 6 7 - 5 2 1 6 3 7 4
M I S T A K E - A I M K S E T
సమాధానం అవుతుంది.

కోడింగ్ - డీకోడింగ్

పోటీ పరీక్షల ప్రత్యేకం
రీజనింగ్




5. పదంలోని అక్షరాలను +గా లేదా -గా (తదుపరి లేదా వెనక అక్షరాలుగా) మార్చిన తరవాత మొదటి అర్ధభాగం, రెండో అర్ధభాగం అదే స్థానంలో రివర్స్ చేయడం:

ఉదా: ఒక సంకేతభాషలో JUNIORను OVKSPJగా రాస్తే అదే సంకేత భాషలో RADIUMను ఏవిధంగా రాస్తారు?

ఎ) EBSNVJ బి) ESBVJN
సి) SBENJV డి) ఏదీకాదు.

సమాధానము:- (ఎ)

వివరణ: ముందుగా JUNIOR అనే పదంలోని అక్షరాలను +1 చేయగా అంటే తదుపరి అక్షరాలుగా రాయగా KVOJPS. వీటిలో మొదటి అర్ధభాగాన్ని రివర్స్ చేయగా OVK రెండో అర్ధభాగాన్ని రివర్స్ చేయగా SPJ. ఈవిధంగా JUNIOR అనే పదం OVKSPJగా కోడ్ చేశారు. అదేవిధంగా RADIUM అనే పదంలోని అక్షరాలను +1 చేయగా అంటే తదుపరి అక్షరాలుగా రాసిన SBEJVN. ఈ అక్షరాలలో మొదటి అర్ధభాగాన్ని రివర్స్ చేయగా EBS. రెండో అర్ధభాగాన్ని రివర్స్ చేయగా VNJ. కాబట్టి సమాధానం EBSNVJ అవుతుంది. దీనినే మరొక విధంగా కూడా చూపవచ్చు.



ఆరో పద్ధతికి సంబంధించిన ప్రశ్నలు

1. ఒక సంకేత భాషలో ORANGEను OHFPSBగా రాస్తే అదే సంకేత భాషలో ANCHORను ఏ విధంగా రాస్తారు?

ఎ) IPRBPD బి) IPSBOD
సి) ISPBDO డి) PSIODB

సమాధానం: (బి)

వివరణ: ముందుగా ORANGE అనే పదంలోని అక్షరాలను +1 చేయగా అంటే తదుపరి అక్షరాలుగా రాయగా PSBOHF. ఈ అక్షరాలలో మొదటి అర్ధభాగాన్ని రెండో అర్ధభాగం స్థానంలో, రెండో అర్ధభాగాన్ని మొదటి అర్ధభాగం స్థానంలోకి మార్పిడి చేస్తే OHFPSB అయింది. అదే విధంగా ANCHORలోని అక్షరాలను +1 చేయగా అంటే తదుపరి అక్షరాలుగా రాయగా BODIPS. ఈ అక్షరాలలో మొదటి అర్ధభాగాన్ని రెండో అర్ధభాగం స్థానంలో, రెండో అర్ధభాగాన్ని మొదటి అర్ధభాగంలోకి మార్పిడి చేసిన IPSBOD సమాధానం అవుతుంది.

2. ఒక కోడ్ భాషలో HOSTELను SDKGNRగా రాస్తే అదే కోడ్ భాషలో SELDOMను ఏవిధంగా రాస్తారు?

ఎ) CNLRDK బి) NCLDRK
సి) CNRLKD డి) CNLRKD

సమాధానము: (ఎ)

వివరణ: HOSTEL అనే పదంలోని అక్షరాలను ముందుగా -1లో రాయగా GNRSDK. దీనిలోని ఎడమవైపు అర్ధభాగంలో గల అక్షరాలను (GNR) కుడివైపు అర్ధభాగంలో, కుడివైపు అర్ధభాగంలో గల అక్షరాలు (SDK) ఎడమవైపు అర్ధభాగంలో రాయగా SDKGNR అవుతుంది. ఇదేవిధంగా SELDOM అనే పదంలోని అక్షరాలను ముందుగా -1లో రాయగా RDKCNL. ఇప్పుడు దీనిలోని ఎడమవైపు అర్ధభాగంలో గల అక్షరాలను RDK కుడివైపు అర్ధభాగంలో, కుడివైపు అర్ధభాగంలో గల అక్షరాలను CNL ఎడమవైపు అర్ధభాగంలో రాయగా CNLRDK సమాధానం అవుతుంది.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్,
సీనియర్ ఫ్యాకల్టీ

తిరుపతి ఐఐటీలో పీజీ, పీహెచ్‌డీ

తిరుపతిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)- పీజీ, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

ఎంటెక్: ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, సివిల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ విభాగాల్లో ఎన్ని స్పెషలైజేషన్‌లకైనా విడివిడిగా అప్లయ్ చేసుకోవచ్చు. ఎంటెక్ ప్రోగ్రామ్‌లో కనీసం రెండు సెమిస్టర్లు పూర్తిచేసినవారు పీహెచ్‌డీకి రిజిస్టర్ చేసుకోవచ్చు. వీటిలో 8 సీజీపీఏ తప్పనిసరి.

విభాగాలు-స్పెషలైజేషన్‌లు

- కెమికల్ ఇంజనీరింగ్
- **సివిల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్:** ఎన్విరాన్‌మెంటల్ అండ్ వాటర్ రిసోర్సెస్ ఇంజనీరింగ్, జియోటెక్నికల్ ఇంజనీరింగ్, స్ట్రక్చరల్ ఇంజనీరింగ్, ట్రాన్స్‌పోర్టేషన్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంజనీరింగ్
- కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్
- **ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్:** సిగ్నల్ ప్రాసెసింగ్ అండ్ కమ్యూనికేషన్స్, మైక్రోఎలక్ట్రానిక్స్ అండ్ వీఎల్ఎస్ఐ, ఆర్ఎఫ్ అండ్ మైక్రోవేవ్ ఇంజనీరింగ్
- **మెకానికల్ ఇంజనీరింగ్:** డిజైన్ అండ్ మాన్యుఫాక్చరింగ్, థర్మల్ ఇంజనీరింగ్ అండ్ ఎనర్జీ సిస్టమ్స్

ఎంపీపీ: మాస్టర్స్ ఇన్ పబ్లిక్ పాలసీ(ఎంపీపీ) ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. కోర్ కోర్సులు, స్పెషలైజేషన్‌కు సంబంధించిన ఎలక్టివ్ కోర్సులు, డిజర్టేషన్ పూర్తిచేయాల్సి ఉంటుంది.

స్పెషలైజేషన్‌లు: సైన్స్ అండ్ మేనేజ్‌మెంట్ ఆఫ్ సస్టయినబిలిటీ, డేటా సైన్స్, సస్టయినబిలిటీ అండ్ ఇంజనీరింగ్

ఎంఎస్ రీసెర్చ్: కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్

పీహెచ్‌డీ: కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, కెమిస్ట్రీ, ఫిజిక్స్, మేథమెటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.400; మహిళలు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.200
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఎంఎస్ రీసెర్చ్, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లకు ఏప్రిల్ 10; ఎంటెక్, ఎంపీపీ ప్రోగ్రామ్‌లకు ఏప్రిల్ 19
- **వెబ్‌సైట్:** iittp.ac.in

జాబ్ కార్నర్

ఎడ్‌సిల్‌లో టీచర్ ట్రెయినీలు

నోయిడాలోని ఎడ్యుకేషనల్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్... ఒప్పంద ప్రాతిపదికన శ్రీలంకలోని పాఠశాలల్లో పనిచేయడానికి టీచర్ ట్రెయినీల భర్తీకి ప్రకటన విడుదల చేసింది. **ఖాళీలు: 50**

పోస్టులు: టీజీటీ టీచర్స్ ట్రెయినీ, పీజీటీ టీచర్స్ ట్రెయినీ

సబ్జెక్టులు: ఇంగ్లిష్, మేథమెటిక్స్, బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ

అర్హత: సంబంధిత విభాగంలో మాస్టర్ డిగ్రీ, బీఈడీ, పని అనుభవంతో పాటు తమిళం/ఆంగ్ల భాష బోధనలో ప్రావీణ్యం ఉండాలి.

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ: ఏప్రిల్ 20

వెబ్‌సైట్: hcicolombo.gov.in/edu_consult

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/1hJDbgNలో చదవండి.



'ఓ మై లిల్లీ'

సిద్ధు జొన్నలగడ్డ, అనుపమా పరమేశ్వరన్ హీరోహీరోయిన్లుగా నటించిన చిత్రం 'టిల్లు స్క్వేర్'. మల్లిక్ రామ్ దర్శకత్వం వహించారు. సూర్యదేవర నాగవంశీ నిర్మించారు. ఈ నెల 29న ఈ చిత్రం విడుదలవుతోంది. సోమవారం ఈ చిత్రం నుంచి థర్డ్ సింగిల్ 'ఓ మై లిల్లీ' అనే పాటను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మల్లిక్ రామ్ మాట్లాడుతూ "ఓ మై లిల్లీ పాట మీ అందరికీ నచ్చుతుందని భావిస్తున్నాను. విజయవంతమైన చిత్రానికి సీక్వెల్ కావడంతో ఈ సినిమా మొదలైనప్పుడే ఎంతో బాధ్యత, ఒత్తిడి ఉందని అర్థమైంది. మీ అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా సినిమా అందరినీ అలరిస్తుందని నమ్ముతున్నాను" అని అన్నారు. కథానాయకుడు సిద్ధు జొన్నలగడ్డ మాట్లాడుతూ "డీజే టిల్లు చేసే సమయంలో ప్రేక్షకుల్లో సినిమాపై పెద్దగా అంచనాలు లేవు. కానీ 'టిల్లు స్క్వేర్'పై ప్రేక్షకుల్లో ఎన్నో అంచనాలు ఉన్నాయి. అందుకే చాలా జాగ్రత్తగా, మొదటి భాగాన్ని మించేలా సినిమాని రూపొందించాం. టిల్లు పాత్ర అలాగే ఉంటుంది. కానీ కథ మాత్రం వేరేలా ఉంటుంది" అని చెప్పారు. కథానాయిక అనుపమా పరమేశ్వరన్ మాట్లాడుతూ "ఈ చిత్ర విడుదల కోసం మేము ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్నాం" అని అన్నారు. నిర్మాత సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ "మొదటి భాగంలాగే, 'టిల్లు స్క్వేర్' కూడా యువతతో పాటు కుటుంబ ప్రేక్షకులను మెప్పిస్తుంది" అని అన్నారు.

మాట వినే హీరోలు దొరికారు



'పంపిణీదారుడిగా కంటే నిర్మాతగా జర్నీ బాగుంది. నచ్చిన కథతో ప్రయాణం చేసే వెసులుబాటు నిర్మాతకు ఉంటుంది' అన్నారు నిర్మాత రాజేశ్ దండా. హాస్య మూవీస్ బేనర్‌పై పలు సినిమాలు నిర్మిస్తున్న ఆయన పుట్టినరోజు (మంగళవారం) సందర్భంగా సోమవారం మీడియాతో ముచ్చటించారు. కొత్త ప్రాజెక్టుల గురించి వివరించారు.

● 'స్వామిరారా' చిత్రంతో పంపిణీదారుడిగా ప్రయాణం ప్రారంభించి ఇప్పటికి దాదాపు 82 సినిమాలు విడుదల చేశా. 'ఒక్క క్షణం', 'నాంది' చిత్రాలకు సహ నిర్మాతగా వ్యవహరించా. అనిల్ సుంకరతో జర్నీ మొదలుపెట్టి 'ఊరిపేరు భైరవకోన', "సామజవర గమన' సినిమాలు తీశా. ప్రస్తుతం. సుబ్బు దర్శకత్వంలో 'బచ్చలమల్లి' సినిమా తీస్తున్నా. 90వ దశకంలో జరిగిన కథతో 'బచ్చలమల్లి' చిత్రం తీస్తున్నాం. చాలా ఆసక్తికరంగా ఉంటుంది. అన్నవరం, తుని పరిసర ప్రాంతంలో షూటింగ్ చేస్తున్నాం. మే 10 నుంచి జరిగే సింగిల్ షెడ్యూల్‌లో సినిమా పూర్తి చేస్తాం. 'అల్లరి' నరేశ్ చిత్రం యాభై శాతం పూర్తయింది. ఆ తర్వాత సందీప్ కిషన్, కిరణ్ అబ్బవరం చిత్రాలు ఉంటాయి. వీరు కాకుండా మరో హీరోతో సినిమా చేయబోతున్నా. వివరాలు త్వరలో చెబుతా.

● నేను చేసే హీరోలు నాకు పర్సనల్ ఫ్రెండ్స్. అన్నీ స్టడీ చేసి సినిమా ప్లాన్ చేస్తుంటా. నా అదృష్టం కొద్దీ నా మాట వినే హీరోలు దొరికారు. కథ, ప్రీ ప్రొడక్షన్, మేకింగ్.. అన్నింటిలో నా ప్రమేయం ఉంటుంది. పంపిణీదారుడిగా ఉన్న అనుభవం నాకు ఉపయోగపడుతోంది.

● హాస్య మూవీస్ బేనర్‌లో తీసే చిత్రాలకు కొత్త కథలు, మంచి కథాంశాలు ఎన్నుకుంటున్నాం. ఇప్పటివరకూ అలాంటివే తీశాం. దర్శకుడు త్రినాథ్‌తో తీసే సినిమా కూడా భిన్నమైన కథాంశంతో ఉంటుంది. నాకు యాక్షన్ సినిమాలంటే ఇష్టం. అందుకే నా సినిమాలో యాక్షన్ పార్ట్ కథానుగుణంగా ఉండేలా జాగ్రత్త తీసుకుంటా.అలాగే పాన్ ఇండియా హీరో, కథ లభిస్తే వచ్చే ఏడాది పాన్ ఇండియా సినిమా తీస్తా. అలాగే ఓ పెద్ద హీరోతో వచ్చే ఏడాది పెద్ద సినిమా తీస్తున్నా. అది ఎవరనేది ప్రస్తుతానికి సస్పెన్స్

మళ్లీ వస్తున్న ప్రభుదేవా 'ప్రేమికుడు'



ప్రభుదేవా నగ్మా హీరోహీరోయిన్లుగా 30 ఏళ్ల క్రితం వచ్చిన మ్యూజికల్ బ్లాక్‌బస్టర్ 'ప్రేమికుడు' చిత్రం మరోసారి ప్రేక్షకుల ముందుకు వస్తోంది. . టాప్ డైరెక్టర్ శంకర్ రెండో ప్రాజెక్ట్‌గా ఇది 1994లో రిలీజై ఆ తరం యువతరాన్ని విశేషంగా ఆకట్టుకుంది. ఈ చిత్రాన్ని కేటి కుంజుమోన్ నిర్మించారు. ఏ. ఆర్. రెహమాన్ ఈ చిత్రానికి అద్భుతమైన సంగీతం అందించారు. గానగంధర్వుడు, స్వర్గీయ ఎస్. పీ. బాలసుబ్రమణ్యం, వడివేలు, రఘువరన్, గిరీష్ కర్నాడ్ కీలక పాత్రల్లో ఆకట్టుకున్నారు. ఈ సినిమా రీ రిలీజ్ రైట్స్ కొన్న నిర్మాతలు రమణ, మురళీధర్ సోమవారం ప్రెస్ మీట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు ముప్పలనేని శివ మాట్లాడుతూ "30 సంవత్సరాల క్రితం వచ్చిన ప్రేమికుడు సినిమాను మళ్లీ ఇప్పుడు రిలీజ్ చేయడం చాలా ఆనందంగా ఉంది. అప్పట్లో ప్రభుదేవా డాన్సులు చూసి స్ప్రింగ్‌లు ఏమన్నా మింగారా అని అనుమానపడేవాళ్లం. అందరితోపాటు ఈ సినిమా కోసం నేనూ ఆతృతగా ఎదురు చూస్తున్నాను" అని అన్నారు. తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ సెక్రటరీ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ "ఈ సినిమా రీ రిలీజ్‌లో కూడా సూపర్‌డూపర్ హిట్ అవుతుంది. ఇందులో గానగంధర్వుడు ఎస్. పి. బాలసుబ్రమణ్యం నటన అద్భుతంగా ఉంటుంది. ప్రభుదేవా నటన, డాన్సులు నగ్మా అందాలు ఈ సినిమాకి ప్రత్యేక ఆకర్షణ" అని చెప్పారు. రీ రిలీజ్ చేస్తున్న రమణ, మురళీధర్ మాట్లాడుతూ "30 ఏళ్ల క్రితం సెన్సేషన్ సృష్టించిన సినిమాను మేము రీ రిలీజ్ చేయడం చాలా ఆనందంగా ఉంది. అతి త్వరలో ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించి, ప్రభుదేవాను ముఖ్య అతిథిగా పిలవాలనుకుంటున్నాం" అని చెప్పారు.



పొలిటికల్ బ్యాక్‌డ్రాప్‌లో..

కన్నడ ఇండస్ట్రీలోని ప్రముఖ నటుల్లో ఒకరైన కోమల్ కుమార్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం యమధీర. మాజీ క్రికెటర్, కేరళ స్పీడ్‌స్టార్ శ్రీశాంత్ ఇందులో నెగెటివ్ రోల్ పోషించారు. శంకర్ ఆర్ దర్శకత్వం వహించారు. వేదాల శ్రీనివాస్ నిర్మించారు. నాగబాబు, ఆలీ, సత్యప్రకాశ్, మధుసూధన్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమాను ఈ నెల 23న విడుదల చేస్తున్నారు. సోమవారం ఈ సినిమా ట్రైలర్‌ను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ సెక్రటరీ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ "యమధీర' టైటిల్ చాలా క్యాచీగా ఉంది. కోమల్ కుమార్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో చాలా అద్భుతంగా నటించారు. ప్రస్తుత ట్రెండ్‌కు తగ్గట్టుగా అత్యున్నత టెక్నికల్ వాల్యూస్‌తో ఈ సినిమాని మన ముందుకు తీసుకొస్తున్నారు" అని అన్నారు.

మళ్లీ ప్రేక్షకుల ముందుకు మగధీర



దర్శక దిగ్గజం రాజమౌళి దర్శకత్వంలో రామ్‌చరణ్ నటించిన తొలి చిత్రం 'మగధీర'. గీతా ఆర్ట్స్ బేనరుపై అల్లు అరవింద్ భారీ బడ్జెట్‌తో నిర్మించిన ఈ చిత్రం ఘన విజయం సాధించి, వసూళ్ల పరంగా కొత్త రికార్డులు సృష్టించింది. రామ్‌చరణ్ పుట్టిన రోజు సందర్భంగా ఈ నెల 26న 'మగధీర' చిత్రం మళ్లీ ప్రేక్షకుల ముందుకు రానుంది. యర్రంశెట్టి రామారావు. అరిగెల కిశోర్ బాబు ఈ సందర్భంగా మాట్లాడుతూ 'తెలుగు రాష్ట్రాల్లో అత్యధిక థియేటర్లలో భారీ స్థాయిలో ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నాం. 'మగధీర' ను రీ రిలీజ్ చేసే అవకాశం ఇచ్చిన నిర్మాత అల్లు అరవింద్‌గారికి కృతజ్ఞతలు. ఈ సినిమాను మరో సారి హిట్ చేసి హీరో రామ్‌చరణ్‌కు బర్త్ డే గిఫ్ట్ ప్రేక్షకులు ఇవ్వాలని కోరుకుంటున్నాం' అన్నారు.

కొండా విజయ్‌కుమార్ 'అహం'



నితిన్ హీరోగా 'గుండెజారి గల్లంతయ్యిందే', నాగచైతన్య హీరోగా 'ఒక లైలా కోసం' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలు రూపొందించిన దర్శకుడు కొండా విజయ్‌కుమార్ ప్రస్తుతం మరో భారీ చిత్రాన్ని రూపొందించే సన్నాహాల్లో ఉన్నారు. ఈ సినిమాకు 'అహం' అనే టైటిల్ నిర్ణయించారు. ఓ ప్రముఖ నిర్మాత తనయుడిని ఈ సినిమాతో హీరోగా పరిచయం చేయనున్నారని సమాచారం. అలాగే నటుడు శివాజీ ఇందులో విలన్‌గా నటిస్తారనీ, ఆయన లుక్ చాలా డిఫరెంట్‌గా ఉండేట్లు దర్శకుడు విజయ్‌కుమార్ కేర్ తీసుకుంటున్నారనీ చెబుతున్నారు. ఈ సినిమా కోసం అనూప్ రూబెన్స్‌ను సంగీత దర్శకుడిగా ఎన్నుకున్నారనీ, ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంతో జరుగుతున్నాయనీ సమాచారం. త్వరలోనే 'అహం' చిత్రం షూటింగ్ ప్రారంభం కానున్నదని అంటున్నారు.


గోదావరి తీరంలో భీమునిపట్నం

కంచర్ల ఉపేంద్ర, అపర్ణాదేవి హీరోహీరోయిన్లుగా నటిస్తున్న '1920 భీమునిపట్నం' చిత్రం షూటింగ్ ప్రస్తుతం గోదావరి తీరంలో జరుగుతోంది. అవార్డు చిత్రాల దర్శకుడు నరసింహ నంది దర్శకత్వంలో కంచర్ల అచ్యుతరావు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. రాజమండ్రి, మునికొడవలి, పూడిపల్లి, దేవీపట్నం, గండి పోచమ్మ గుడి ప్రాంతాల్లో షూటింగ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ 'రామోజీ ఫిల్మ్ సిటీలో కొన్ని కీలక సన్నివేశాలను చిత్రీకరించాం. ప్రస్తుతం గోదావరి తీరంలో షూటింగ్ జరుగుతోంది. సాతంత్ర్య ఉద్యమ నేపథ్యంలో సీతారామ్, సుజాత పాత్రల మధ్య నడిచే ప్రేమకథను దర్శకుడు అద్భుతంగా చిత్రీకరిస్తున్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజాగారు అందించే సంగీతం మా చిత్రానికి హైలైట్‌గా నిలుస్తుంది.' అని చెప్పారు. సాతంత్ర్య పోరాట ఉద్యమ సమయంలో జరిగిన కొన్ని సంఘటలను ప్రేరణగా తీసుకుని ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు దర్శకుడు నరసింహ నంది చెప్పారు. ఇందులో హీరో ఉపేంద్ర బ్రిటీష్ ప్రభుత్వ పోలీస్ అధికారి పాత్రను, హీరోయిన్ అపర్ణాదేవి సాతంత్ర్య సమరయోధుడి పాత్రను పోషిస్తున్నారని తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: ఇళయరాజా, ఫొటోగ్రఫీ: ఎస్.మురళీమోహనరెడ్డి, సహ నిర్మాతలు: కంచర్ల సుబ్బలక్ష్మి, కంచర్ల సునీత.



'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/62B0XPM లో చదవండి.







ప్రధాని నరేంద్రమోదీతో మాట్లాడుతున్న మాజీ మంత్రి ప్రత్తిపాటి (ఫైల్)

'ప్రజాగళం' సభ విజయవంతం

- లక్షలాది మంది హాజరై చరిత్ర సృష్టించారు
- సభకు భూములిచ్చిన రైతులకు, మీడియా ప్రతినిధులకు ధన్యవాదాలు
- విలేకరుల సమావేశంలో మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, మార్చి 18 : టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మకంగా బొప్పూడి వద్ద నిర్వహించిన ప్రజాగళం సభకు రాష్ట్రం నలుమూలల నుంచి లక్షలాది మంది ప్రజలు హాజరై చరిత్ర సృష్టించారని మాజీమంత్రి, రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. దక్షిణ భారతదేశంలో ఇప్పటివరకు జరిగిన సభల్లో ఇదే పెద్దసభ అని పలువురు నేతలు తనతో వ్యాఖ్యానించినట్లు తెలిపారు. ప్రధాని హెలికాప్టర్‌లో సభా ప్రాంగణానికి చేరుకునే ముందు ఏరియల్ వ్యూలో చుట్టూ కిలోమీటర్ల మేర ప్రజలే కనిపించారని మోదీ చంద్రబాబుతో అన్నారని ప్రత్తిపాటి తెలిపారు. ఇంతటి గొప్పసభ నిర్వహించడానికి భూములు ఇచ్చిన రైతులకు, విస్తృత ప్రచారం కల్పించిన మీడియాకు ధన్యవాదాలు తెలిపారు. 2014లో గుంటూరులో ఎన్డీఏ కూటమి ఆధ్వర్యంలో జరిగిన తొలిసభలో నాటి జిల్లాపార్టీ అధ్యక్షుడిగా సభను పర్యవేక్షించానని, తిరిగి పదేళ్ళ తర్వాత తన పర్యవేక్షణలో ఎన్డీఏ మిత్రపక్షాల ఆధ్వర్యంలో తొలి బహిరంగసభ జరగడం అదృష్టంగా భావిస్తున్నానని, నాటి సెంటిమెంట్ మరలా పునరావృతమవుతుందని, మూడోసారి అధికారంలోకి వచ్చి హ్యాట్రిక్ సాధించబోతున్నారని ప్రధాని మోదీకి ముందస్తు శుభాకాంక్షలు తెలిపానని ప్రత్తిపాటి అన్నారు. సభ సజావుగా సాగడానికి సహకరించాల్సిన ప్రభుత్వం ఏ మాత్రం సహకరించకపోగా సభ జరిగే సమయంలో మూడుసార్లు విద్యుత్ సరఫరాను నిలిపి వేసిందని, సౌండ్ సిస్టం ఆర్గనైజింగ్ ఏరియాలోకి దూకినవారిని నియంత్రించాలని సాక్షాత్తు దేశ ప్రధానే అభ్యర్థించినా పోలీసు యంత్రాంగం చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారని, ట్రాఫిక్ ఆంక్షల పేరుతో లక్షలాది మందిని సభా స్థలికి చేరుకోకుండా చేశారని మండిపడ్డారు. ఎన్ని ఇబ్బందులు పెట్టినా ప్రజలు భారీగా తరలి వచ్చి విజయవంతం చేశారన్నారు. సభ విజయవంతానికి కృషి చేసిన ఎన్డీఏ కూటమి కార్యకర్తలకు, నేతలకు ధన్యవాదాలు తెలియచేశారు.

ప్రజాగళం సభ నిర్వహణ భేష్ ..

గుంటూరు (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం, పోలీసులు ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రజాగళం ఎన్‌డీఏ బహిరంగ సభని బ్రహ్మాండంగా నిర్వహించారని ప్రధాని నరేంద్రమోదీ చిలకలూరిపేట నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావుని అభినందించారు. సభలో పాల్గొనేందుకు వచ్చిన ప్రధాని మోదీతో ప్రత్తిపాటి కాసేపు ముచ్చటించారు. బొప్పూడి ఆంజనేయస్వామి పాదాల చెంతని నిర్వహించిన ఈ సభకు లక్షలాది మంది ప్రజలు రాష్ట్ర వ్యాప్తంగా హాజరయ్యేలా చేసినందుకు ప్రధాని మోదీ ప్రత్యేకించి పుల్లారావుని ప్రశంసించారు. ఇదే ఉత్సాహాన్ని ఎన్నికలు ముగిసేంత వరకు కొనసాగించి ఎన్‌డీఏ కూటమి ఘన విజయానికి తోడ్పడాలన్నారు.

మాటల్లో కాదు.. చేతల్లో చేసి చూపిస్తా..

- మంగళగిరిని అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా మారుస్తా..
- అధికారంలోకి రాగానే జెట్ స్పీడుతో 'అమరావతి' పనులు
- నియోజకవర్గ ప్రజలకు నిత్యం అందుబాటులోనే వుంటా
- మంగళగిరి టీడీపీ అభ్యర్థి నారా లోకేశ్
- పలువురి తటస్థులతో ఇష్టాగోష్ఠి



మంగళగిరిలో అందె వెంకన్న కుటుంబీకులతో లోకేశ్ మాటామంతీ

మంగళగిరి, మార్చి 18: మంగళగిరి ప్రజలు తనకు ఎమ్మెల్యేగా అవకాశమిస్తే మంగళగిరి నియోజకవర్గాన్ని అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా మార్చి చూపిస్తానని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అన్నారు. నియోజకవర్గంలోని పలువురు తటస్థ ప్రముఖులను సోమవారం ఉదయం ఆయన కలుసుకుని వారితో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. తాను మాటల మనిషిని కాదని, చెప్పినవన్నీ చేతల్లో చేసి చూపించడమే తన అభిమతమని చెప్పారు. ప్రతిపక్ష వైసీపీ నేతలు తనపై అనేకరకాలుగా దుష్ప్రచారాలు చేస్తున్నారని, గత ఎన్నికల్లో అనుసరించిన అనైతిక విధానాలనే ఇప్పుడూ అనుసరిస్తున్నారన్నారు. ముఖ్యంగా తాను ప్రజలకు అందుబాటులో వుండనంటూ సాగిస్తున్న ప్రచారంపై తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తంచేశారు. నియోజకవర్గంలోని అన్నీ వర్గాల ప్రజలకు తాను నిత్యం అందుబాటులోనే వుంటానన్నారు.

చేనేతరంగం అభివృద్ధికి కట్టుబడి వున్నా ..

మంగళగిరి ఎనిమిదవ వార్డుకు చెందిన ఆరెస్సెస్ క్రియాశీలక సంచాలక్ సభ్యుడు అందె వెంకన్న నివాసానికి వెళ్లిన యువనేతకు వారి కుటుంబసభ్యులు సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వెంకన్న నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలతో పాటు చేనేతలు ఎదుర్కొంటున్న సమస్యలను గురించి లోకేశ్‌కు వివరించారు. యువగళం పాదయాత్ర సందర్భంగా తాను రాష్ట్రవ్యాపితంగా వున్న చేనేతల సమస్యలపై లోతైన అధ్యయనం చేశానని లోకేశ్ తెలిపారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక చేనేతల సమస్యలకు శాశ్వత ప్రాతిపదికన పరిష్కార మార్గాలను చూపుతానని హామీనిచ్చారు. ఇప్పటికే మంగళగిరిలో టాటా ట్రస్టు ద్వారా మంగళగిరి చేనేత వస్త్రాలకు మార్కెటింగ్ కల్పిస్తూ పైలెట్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టిన సంగతిని ఆయన గుర్తుచేశారు. ఈ ప్రాజెక్టు విజయవంతమైతే దీనిని రాష్ట్రంలోని అన్నీ చేనేత కేంద్రాల్లో అమలుచేస్తామన్నారు. టీడీపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చేనేత ఉత్పత్తులకు జీఎస్టీ రద్దు చేసేవిధంగా తగు చర్యలు తీసుకుంటామన్నారు.

ఇకపై వేధింపులు లేని వ్యాపారాలు చేసుకోవచ్చు..

అనంతరం లోకేశ్ నవులూరు వెళ్లి యాదవ సామాజికవర్గ ప్రముఖుడు, ఇటుకల వ్యాపారి బత్తుల శ్రీనివాసరావును కలుసుకున్నారు. ఈ సందర్భంగా బత్తుల వ్యాపారరంగంలో ఎదుర్కొంటున్న సమస్యలను గురించి లోకేశ్‌కు వివరించగా...గత అయిదేళ్లుగా రాష్ట్రంలో ఏ వ్యాపారవర్గం ప్రశాంతంగా వ్యాపార కార్యకలాపాలను నిర్వహించుకునే అవకాశం లేకుండా పోయిందన్నారు. ఇసుక అందుబాటులో లేకుండా చేయడంతో నిర్మాణరంగం తీవ్రంగా నష్టపోయిందన్నారు. రాబేయే ప్రజాప్రభుత్వంలో ఎటువంటి వేధింపులు లేకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో వ్యాపారాలను నిర్వహించుకునేలా చర్యలు తీసుకుంటామని లోకేశ్ హామీనిచ్చారు. అలాగే బీసీలకు అన్నివిధాలుగా అండగా నిలిచేది టీడీపీ మాత్రమేనన్నారు.

రాజధాని నిర్మాణపనులతో అందరికీ ఉపాధి ..

ఎర్రబాలెంలోని ముస్లీం సామాజికవర్గ ప్రముఖుడు, ఆటోమొబైల్ వ్యాపారి షేక్ సయ్యద్ బాజీని కలుసుకున్నారు. అమరావతి నిర్మాణ పనులను వైసీపీ ప్రభుత్వం నిలిపివేయడంతో తమ గ్రామంలో ఎంతో మంది యువకులు ఉపాధిని కోల్పోయారని లోకేశ్‌కు వివరించారు. ఈ విషయంపై లోకేశ్ స్పందిస్తూ టీడీపీ హయాంలో మైనారిటీల అభివృద్ధి, సంక్షేమం కోసం అనేక పథకాలను అమలుచేశామని గుర్తుచేశారు. ముఖ్యంగా రంజాన్ తోఫా, పెళ్లికానుక, ఇమామ్, మౌజమ్‌లకు గౌరవవేతనం, షాదిఖానాల నిర్మాణం, రంజాన్ వస్తే మసీదులకు మరమ్మతులు, రంగులు వేసేందుకు నిధులను మంజూరుచేయడం వంటి అనేక కార్యక్రమాలను టీడీపీ అమలుచేసిందన్నారు. కానీ జగన్ అధికారంలోకి వచ్చాక వాటన్నింటిని నిలుపుదల చేసి ముస్లీంల సంక్షేమంపై పెనుదెబ్బ కొట్టాడన్నారు. వైసీపీ నాయకుల దాడులు, వేధింపుల కారణంగా అబ్దుల్ సలామ్, మిస్బా, ఇబ్రహీం వంటి ఎంతోమంది అమాయకులు ప్రాణాలను కోల్పోయారన్నారు. చంద్రబాబు నేతృత్వంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డాక అమరావతి నిర్మాణ పనులను జెట్ స్పీడుతో పరుగులు తీయిస్తామని, అలాగే ఎర్రబాలెంలో షాదీఖానా నిర్మాణానికి కూడ తగు చర్యలు తీసుకుంటామని లోకేశ్ ఈ సందర్భంగా హామీనిచ్చారు.

కార్యక్రమంలో లోకేశ్ వెంట టీడీపి నాయకులు తమ్మిశెట్టి జానకీదేవి, ఆకుల జయసత్య, ఆరుద్ర భూలక్ష్మి, నందం అబద్ధయ్య, దామర్ల రాజు, గోవాద దుర్గారావు, వింజమూరి ఆషాబాల, షేక్ రియాజ్, తోట పార్థసారధి, ఆకుల ఉమామహేశ్వరరావు, పలగాని తాతారావు, కర్నాటి శివ సత్యనారాయణ, నీలం అంకారావు, జిలానీ, మహ్మద్ ఫిరోజ్‌ఖాన్, వేమూరి మైనర్ బాజు, నజీర్, మల్లవరపు వెంకట్రావు, జనసేన ఎర్రబాలెం గ్రామపార్టీ అధ్యక్షులు సాయినందన్, కాపరౌతు సుందరయ్య, పావని, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.



ఎర్రబాలెంలో షేక్ బాజీ కుటుంబసభ్యులతో లోకేశ్

భర్తకు జైలు.. జరిమానా

సత్తెనపల్లి,మార్చి18: భార్యపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచిన కేసులో నిందితుడైన భర్త దోషిగా తేలడంతో ఏడు సంవత్సరాల జైలు శిక్ష, రూ.2 వేలు జరిమానా విధిస్తూ సోమవారం సీనియర్ సివిల్ జడ్జి డీ.నాగవెంకటలక్ష్మీ తీర్పునిచ్చినట్లు ఏపీపీ బగ్గీ నరసింహరావు తెలిపారు. అమరావతి మండలం అత్తలూరుకు చెందిన కోట అర్జున్, తన భార్య మేరిని మానసికంగా శారీరకంగా హింసకు గురిచేయటమే కాకుండా రోకలిబండతో తలపై కొట్టి తీవ్రంగా గాయపర్చాడు. మేరి ఫిర్యాదుమేరకు అమరావతి పోలీస్‌స్టేషన్లో 2022 మార్చి 16న కోట అర్జున్‌పై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తుచేశారు. కోర్టులో అర్జున్‌పై నేరం రుజువు కావటంతో అర్జున్‌కు పైవిధంగా శిక్షను ఖరారు చేశారని ఏపీపీ బగ్గీ నరసింహరావు తెలిపారు.

విధుల నుంచి వలంటీరు తొలగింపు

- ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గురజాలటౌన్, మార్చి 18: గురజాల పట్టణంలోని సచివాలయం - 3 పరిధిలోని క్లస్టర్ -5 వలంటీర్ ఆవుల గోపాలకృష్ణను విధుల నుంచి తొలగించినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి రమణకాంత్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా గోపాలకృష్ణ కరపత్రాలు పంచుతుండడంపై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తకు ఉన్నతాధికారులు స్పందించారు. గోపాలకృష్ణను విధులు నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

రైలు కిందపడి సమోసాల విక్రేత మృతి

బాపట్ల,మార్చి 18 : రైలు కిందపడి సమోసాలు విక్రయించే ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం బాపట్ల రైల్వేస్టేషన్ సమీపంలో జరిగింది. రైల్వే అధికారులు తెలిపిన వివరాలు ప్రకారం.. విజయవాడకు చెందిన షేక్.సమ్మర్ (45) రైలులో ప్రైవేట్ కాంట్రాక్ పద్ధతిలో సమోసాలు, వాటర్‌బాటిళ్ళు విక్రయించేవాడని, పూరి-తిరుపతి రైలులో మొబైల్ క్యాటరింగ్ చేస్తూ ఉండేవాడని తెలిపారు. రైలు తెనాలి వైపు నుంచి ఒంగోలు వైపుకు వెళుతున్న సమయంలో ప్రమాదం జరిగింది. పూరి నుంచి తిరుపతి వెళుతున్న రైలు బాపట్ల రైల్వేస్టేషన్‌లో అధిక సమయం ఆగేసరికి సమ్మర్ రైలు దిగి పక్కనే ఉన్న బహిరంగ ప్రదేశంలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి, రైలు కదిలే సమయంలో ఎక్కుతుండగా కాలుజారి రైలు కిందపడి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నట్లు రైల్వేపోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో సమ్మర్ దేహం రెండు ముక్కలుగా విడిపోయినట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నామని రైల్వే పోలీసులు తెలిపారు.

వారంలో ఆరు రోజులు కార్డియాలజీ ఓపీ

- గుంటూరు జీజీహెచ్‌లో 20 నుంచి ప్రారంభం

గుంటూరు (మెడికల్) మార్చి 18: గుంటూరు నగరంలోని ప్రభుత్వాస్పత్రిలో ఈ నెల 20నుంచి గుండె జబ్బుల వైద్య విభాగం (కార్డియాలజీ) ఓపీ సేవలు సోమవారం నుంచి శనివారం వరకు అందుబాటులో ఉంటాయని జీజీహెచ్‌సూపరింటెండెంట్ డాక్టర్ వై.కిరణ్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆసుపత్రి ఆవరణలోని క్షయ నియంత్రణ విభాగాన్ని ఆయన పరిశీలించారు. టీబీ సెంటర్‌ను ఇక్కడ నుంచి తొలగించి ఇక్కడ కార్డియాలజీ ఓపీ వార్డును ఏర్పాటు చేస్తున్నట్లు డాక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు. ఇందుకోసం అక్కడ వున్న ఆరు ఆరు గదులను ఆధునీకీకరిస్తున్నట్లు తెలిపారు. గతంలో కార్డియాలజీ ఓపీ వారంలో మూడు రోజులు మాత్రమే పని చేసేదని, ఇకపై ఆరు రోజులు రోగులకు అందుబాటులో ఉంటుదని తెలిపారు. టీబీ సెంటర్‌ను మహిళా పీజీ వసతి గృహం ఎదుట నిర్మించిన నూతన భవనంలోకి మారుస్తున్నట్లు ఆయన తెలిపారు.

పాముకాటుతో వృద్ధురాలి మృతి

దుర్గి, మార్చి 18: పాముకాటుకు గురై వృద్ధురాలు మృతి చెందిన సంఘటన మండలంలోని మించాలపాడులో జరిగింది. మండలంలోని ధర్మవరంకు చెందిన తోకల హనుమమ్మ(70) కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తోంది. సోమవారం మండలంలోని మించాలపాడు పొలాలకు మిర్చికోతలకు వెళ్లింది. పొలంలో మిరప కాయలు కోస్తుండగా హనుమాయ్మను పాము కాటు వేసింది. దీంతో ఆమె అక్కడికక్కడే కుప్పకూలిపోయింది. తోటి కూలీలు వెంటనే ఆమెను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందింది. ఎస్‌ఐ కోటయ్య కేసు నమోదు చేసి దర్యాపుత చేస్తున్నారు. మృతురాలికి భర్త వెంకట్రామయ్య, ముగ్గురు సంతానం ఉన్నారు.



ప్రసంగిస్తున్న వీసీ ఆచార్య పీ. రాజశేఖర్, హాజరైన ఇతర అధికారులు

బయో మెడికల్ ఇన్‌స్ట్రుమెంటేషన్‌కు మంచి భవిష్యత్తు ఉంది

- ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వీసీ ఆచార్య పీ.రాజశేఖర్

పెదకాకాని, మార్చి 18: బయో మెడికల్ ఇన్‌స్ట్రుమెన్షన్ రంగానికి మంచి భవిష్యత్తు ఉందని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాల యం వీసీ ఆచార్య పీ.రాజశేఖర్ తెలిపారు. సోమవారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం లోని ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెన్షన్ విభాగంలో 'బయో మెడికల్ ఇన్‌స్ట్రుమెన్టేషన్" అనే అంశంపై జాతీయ సదస్సు జరిగింది. కార్యక్రమానికి విశ్వవిద్యాలయ ఉప కులపతి ఆచార్య పట్టేటి రాజశేఖర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బయో మెడికల్ ఇన్‌స్ట్రుమెన్స్‌లో వివిధ రకాలైన సెన్సార్‌లు మన దైనందిన జీవితాలలో ఎలా వినియోగపబడతాయో వివరించారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న మెడికల్ ఎడ్యుకేషన్ ఎడిషనల్ డైరక్టర్, ప్రిన్సిపాల్ డాక్టర్.ఎన్.వి. సుందరాచారి, ఈఎంజీ, ఈఈజీ, ఇన్‌స్ట్రుమెంట్స్ నరాల సంబంధిత వ్యాదులను గుర్తించు విధానాన్ని వివరించారు. గౌరవ అతిథిగా పాల్గొన్న మంగళగిరి ఎయిమ్స్ వైద్యులు డాక్టర్. కిషోర్ శేషమ్ ఎలక్ట్రానిక్ మైక్రోస్కోప్ పనితీరు, ఉపయోగాలను వివరించారు. సదస్సు డైరెక్టర్ ఆచార్య సంధ్యా కోల్ వివిధ రకాల బయో మెడికల్ ఇనుస్టుమెంట్స్ ప్రాముఖ్యతను వివరించారు. సదస్సులో ఆచార్య ఆర్‌వీఎస్ఎస్ రవికుమార్, ఆచార్య వీ.రవికుమార్, ఆచార్య ఎం.రామిరెడ్డి, ఆచార్య సిహెచ్. లింగరాజు, బీ. నాగరాజు, డాక్టర్. డీ. షర్మిల పాల్గొన్నారు.

మిర్చి రైతులు తక్‌పట్టీ వెంట తీసుకెళ్లాలి

గుంటూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ అమలులో వున్న నేపథ్యంలో మిర్చి లావాదేవీలు నిర్వహించే రైతులు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని మార్కెటింగ్‌శాఖ జేడీ కే.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో సూచించారు. రైతులు ఎవరికైతే మిర్చిని విక్రయించారో ఆ కమిషన్ వ్యాపారి వద్ద నుంచి తక్‌పట్టీని తప్పనిసరిగా తీసుకొని వెంట ఉంచుకోవాలన్నారు. ఎక్కడైనా చెక్‌పోస్టుల వద్ద పోలీసులు తనిఖీలు చేస్తూ ఆపితే ఆ తక్‌పట్టీని చూపించాలన్నారు. తక్‌పట్టీలో పొందుపరిచిన గణాంకాలతో చేతిలో ఉన్న నగదు సమంగా ఉండాలని స్పష్టం చేశారు.

త్వరలోనే ప్రజా ప్రభుత్వం ఏర్పాటు

- టీడీపీ గురజాల అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, మార్చి 18: రాష్ట్రంలో త్వరలో ప్రజా ప్రభుత్వం ఏర్పాటు కాబోతోందని టీడీపీ గురజాల అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు అధికారం మార్పు కోరుకుంటున్నారని, ప్రజలు వేలాదిగా తరలివచ్చి ప్రజాగళం సభను విజయవంతం చేయడమే ఇందుకు నిదర్శనమన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌లు రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వ ఏర్పాటు ఆవశ్యకతను ప్రజాగళం సభలో వివరించారన్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడం టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందన్నారు. రాష్ట్ర భవిష్యత్ బాగుండాలంటే చంద్రబాబు సీఎం కావాలన్నారు. వైసీపీ ప్రభుత్వంపై ప్రజలు ఎంతటి వ్యతిరేకతతో ఉన్నారో ప్రజాగళం సభకు తరలివచ్చిన జనసందోహాన్ని చూస్తే అర్థమవుతుందన్నారు. అందరం కలిసికట్టుగా ఉండి రానున్న ఎన్నికల్లో వైసీపీని ఓడించి, కూటమిని గెలిపించి నారా చంద్రబాబునాయుడుని సీఎం చేద్దామని యరపతినేని పిలుపునిచ్చారు.



జంపని, బలిజేపల్లి గ్రామాల్లో వైసీపీ రంగులతో రైతు భరోసా కేంద్రాలు

యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘనలు

- అనుమతి లేకుండా అడ్డగోలుగా ప్రచారాలు
- వైసీపీ రంగులతో దర్శనమిస్తున్న రైతు భరోసా కేంద్రాలు
- నేతల బొమ్మలతో రేషన్ పంపిణీ వాహనాలు
- ప్రశ్నిస్తున్న ప్రజలు.. పట్టించుకోని అధికారులు..

ప్రత్తిపాడు, మార్చి 18: ఎన్నికల కోడ్ అమలులోనికి వచ్చిందని అధికారులు ఇంకా భావిస్తున్నట్టు లేదు. ఇంకా తాము వైసీపీ ప్రభుత్వంలోనే ఉద్యోగాలు చేస్తున్నామనుకుంటున్నారో ఏమో.. అనుమతులు లేకుండా తిరుగుతున్న వైసీపీ ప్రచార వాహనాలను చూస్తే అంతే అనిపిస్తుంది. ప్రత్తిపాడు నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్‌కు చెందిన ప్రచార వాహనాలు ప్రత్తిపాడులో యథేచ్ఛగా తిరుగుతున్నాయి. ఎన్నికల కోడ్ అమలులోనికి వచ్చిన తర్వాత ఎన్నికల అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి కార్యక్రమాలు చేయడానికి వీలులేదు. ప్రచారం కోసం గ్రామాలలో వాహనాలను తిప్పాలంటే తప్పకుండా వాహనానికి, మైక్‌నకు అనుమతి తప్పనిసరి. ఇవేమీ లేకుండా ప్రత్తిపాడు మండలంలో వైసీపీ ప్రచార వాహనాలు పదుల తిరుగుతున్నాయి. ఈ విషయంపై ప్రత్తిపాడు తహసీల్దార్ పద్మశ్రీని వివరణ కోరగా.. ఇంత వరకు తాము ఏ రాజకీయ పార్టీల ప్రచార వాహనాలకు అనుమతి ఇవ్వలేదన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ మొత్తం ఎంపీడీవో చూస్తారని, ఈ విషయాన్ని వారికి తెలియజేస్తానని అన్నారు.

వేమూరు : వేమూరు మండలంలోని వ్యవసాయశాఖ ఎన్నికల కోడ్‌ను ఖాతరు చేయడం లేదు. మండల పరిధిలోని 17 గ్రామాల్లోని 14 రైతు భరోసా కేంద్రాలకు వేసిన వైసీపీ రంగులను అధికారులు మార్చనేలేదు. వాటిలో మూడు కేంద్రాలు ప్రభుత్వ భవనాల్లో కొనసాగుతున్నాయి. మిగతా 11 భవనాలు వైసీపీ నేతలకు సంబంధించినవి వాటికి పార్టీ రంగులు వేసి ఉన్నాయి.



నేతల చిత్రాలతో ప్రత్తిపాడులో వైసీపీ ప్రచార వాహనం , బేతపూడిలో రేషన్ వాహనం

రేపల్లె : ఇంటింటికి రేషన్ పంపిణీ చేసే ఎండీయూ వాహనాలపై సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి బొమ్మలు, వివిధ పథకాలతో ఏర్పాటు చేసిన లోగోలు ఉన్నాయి. అయితే మండలంలోని బేతపూడి గ్రామంలో ఆయా వాహనాలు అధికార పార్టీ నేతల, లోగోలతో యథేచ్ఛగా తిరుగుతు న్నాయి. ఈ వాహనాలకు ఎన్నికల కోడ్ వర్తించదా అని ఆయా గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సంబంధిత డీలర్లపై, వాహనదారులపై చర్యలు తీసుకోవాలని బేతపూడి గ్రామస్థులు కోరుతున్నారు.

ఉద్యోగులే పెయింటర్లు ..

- ఎన్నికల కోడ్‌తో వైసీపీ రంగుల తొలగింపు



వైసీపీ రంగులను తొలగిస్తున్న కార్యాలయ సిబ్బంది

కొల్లూరు, మార్చి 18: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉన్న భవనానికి వైసీపీ రంగులు తొలగించేందుకు ఉద్యోగులే పెయింటర్ల అవతారమెత్తారు. కొల్లూరు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఓభవనానికి వైసీపీ రంగులు ఉన్నాయి. ఎన్నికలకోడ్ అమల్లోకి రావడంతో ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్‌లో వెంటనే రంగులు తొలగించాలని ఆదేశించారు. దీంతో ఎంపీడీవో లక్ష్మీకుమారి తమ సిబ్బంది వాటిని తీసివేసేందుకు పెయింటర్లను సంప్రదించాలని కోరారు. పెయింటర్లు ఎవరూ అందుబాటులో లేకపోవడంతో సిబ్బందే హడావుడిగా రంగులు తొలగించే పనుల్లో నిమగ్నమయ్యారు. మండల పరిధిలో ఉన్న రైతు భరోసా కేంద్రాలకు వేసిన రంగుల తొలగింపు పనులు మాత్రం అమలు కాలేదు.



వెంకటపాలెం రైతు ధర్నా శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు

రాష్ట్రాన్ని అధోగతి పట్టించిన జగన్‌రెడ్డి

- 1553వ రోజుకు చేరుకున్న రైతుల ఆందోళనలు

తుళ్లూరు, మార్చి 18 బాధ్యతలులేని పాలన చేసి సీఎం జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని అధోగతి పట్టించారని రాజధాని అమరావతి నిర్మాణనికి 33 వేల ఎకరాలు త్యాగంచేసిన రైతులు, మహిళలు ఆరోపించారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్, మూడు రాజధానులు వద్దు, ఐదు కోట్ల మంది కోరుకునే, రాష్ట్ర నడిబొడ్డులో ఉన్న రాజధాని అమరావతే రాష్ట్ర ఏకైక రాజధానిగా కొనసాగించాలంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు సోమవారం నాటికి 1553 వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుండి వారు మాట్లాడుతూ... రాజధాని అమరావతిని నిర్వీర్యం చేసిన పాలకుల అడ్రస్ గల్లంతేనని స్పష్టం చేశారు. రాష్ట్రాభివృద్ధి కోసం పని చేయాల్సిన వైసీపీ ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరించిందన్నారు. అమరావతిని స్వాగతిస్తున్నాని చెప్పిన సీఎం జగన్‌రెడ్డి మూడు రాజధానులంటూ అమరావతిని నిర్వీర్యం చేశాడని మండిపడ్డారు. రాష్ట్రంలో ఎక్కడా, ఎప్పుడూ రాజ్యాంగబద్ధ పాలన సాగలేదన్నారు. ఇప్పటికైనా సీఎం జగన్‌రెడ్డి అమరావతిని రాష్ట్ర ఏకైక రాజధానిగా ప్రకటించి అభివృద్ధిని కొనసాగించాలని డిమాండ్ చేశారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి జై ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాలలో ఆందోళనలు కొనసాగాయి.

ఐటీబీపీ సిబ్బంది చెక్‌పోస్టు ఏర్పాటు

రెంటచింతల, మార్చి 18: కృష్ణానది ఒడ్డున గల నాగార్జున సాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్ట్ రెండో గేటు (తెలంగాణ రాష్ట్రం) వద్ద ఇండో టిబెటిన్ బోర్డర్ పోలీసు(ఐటీబీపీ)లతో చెక్‌పోస్టు ఏర్పాటు చేసినట్లు అడవిదేవరపల్లి ఎస్‌ఐ హరిబాబు తెలిపారు. నలుగురు ఐటీబీపీ సిబ్బందితోపాటు ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు, ఇద్దరు హోంగార్డులు విధుల్లో ఉంటారన్నారు. అక్రమంగా మద్యం, నగదు తరలిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ తెలిపారు. మెయిన్ గేటు వద్ద ఇప్పటికీ రెంటచింతల పోలీసులతో చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు.



వాహనాలు తనిఖీ చేస్తున్న ఐటీబీపీ సిబ్బంది

1,28,403 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 1,35,599 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 1,28,403 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 84,046 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	10000	19500
నెంబరు. 5	9500	17000
273	12500	15000
341	9000	18500
4884	--	--
సూపర్ 10	13000	13000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	9000	21000
బ్యాడిగి	9000	18000
దేవనూరు డీలక్స్	10000	18500
తెల్లకాయలు	5000	12500

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.23
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	106, 114,125
చికెన్ విత్ స్కిన్	204.00
చికెన్ స్కిన్ లెస్	214.00

ఆంధ్రజ్యోతి DAILY CLASSIFIEDS

ఉద్యోగావకాశాలు

- గుంటూరు, కొత్తపేటలోని ఇంటి వద్ద పనిచేయుటకు వాచ్‌మెన్ కావలెను. (భార్య భర్తలకి ప్రాధాన్యత) వసతి సౌకర్యం కలదు. సంప్ర॥ 9866132826, 94411 21025 AJG-184693
- గుంటూరు, కొత్తపేటలోని ప్రముఖ డయాగ్నోస్టిక్ సెంటర్‌లో ఫాస్ట్‌గా టైపింగ్ చేయగల లేడీ కంప్యూటర్ ఆపరేటర్ కావలెను. సంప్ర॥ 9885690107 AJG-184755
- S.M.R. మార్కెటింగ్ Pvt. Ltd. కంపెనీలో పనిచేయుటకు సేల్స్ మేనేజర్స్, ఫీల్డు ఆఫీసర్స్ & Door To Door మార్కెటింగ్ చేసే వారు యువతి, యువకులు కావలెను. ఫోన్ : 9440271577. RK-1396
- ప్రముఖ రెస్టారెంట్ నందు పనిచేయుటకు అనుభవంగల స్టీవార్డ్, కెప్టెన్, హౌస్ కీపింగ్ స్టాఫ్, లేడీస్ & జెంట్స్, ఎక్స్‌పీరియన్స్ & ఫ్రెషర్స్, బెస్ట్ శాలరీ, అకామిడేషన్, సెల్: 9642777765, 9710519999. AJO-183901

వధువు కావలెను

- బ్రాహ్మణ M.Com, 36, 5'3", ప్రైవేటు జాబ్, తల్లిదండ్రులు లేని వరుడికి అందమైన డిగ్రీ చదవిన వధువు కావలెను. సంప్ర॥ 94929 86151 AJG-184688
- కాపు, 5'7", బి.టెక్, ప్రైవేటు జాబ్, హైదరాబాద్‌లో సెటిల్ అయిన వరుడికి 5'2", ఎత్తు గల అందమైన వధువు కావలెను. సంప్ర॥ 94929 86151. AJG-184689

జ్యోతిష్యాలయము

- కోయ పూజారి ఎటువంటి సమస్యలకైనా ఫోన్‌లోనే పరిష్కారం చెప్పబడును. కుటుంబం, లక్ష్మీ నిలకడ, భార్యభర్తల గొడవలు, ప్రేమ, పెళ్ళి సంతానం విద్య, ఉద్యోగం, ఆరోగ్యం ఏ సమస్యకైనా 9 రోజుల్లో పరిష్కారం. సంప్ర॥ 99 63 14 71 72 SAAA-709

గోల్డ్ ఫైనాన్స్

బంగారం కొనబడును

- బంగారము బ్యాంకులలో, ఇతర సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (హాల్ మార్క్) 100% జెన్యూన్ సంప్ర॥ 88024 89999 AJB-182103

CHANGE OF NAME

- I, TADIKONDA VENKATA LAKSHMI NAGA SIVA KUMARI W/o. TADIKONDA SITARAMAIAH. Door No: 6-80, Lock Centre, KOLLURU (Village), KOLUURU (Mandal), Bapatla (District), AP. I, have changed my name as T. SIVA KUMARI w/o TADIKONDA SITARAMAIAH (old Name) TADIKONDA VENKATA LAKSHMI NAGA SIVA KUMARI w/o TADIKONDA SITARAMAIAH (New Name). Hereafter my name known as TADIKONDA VENKATA LAKSHMI NAGA SIVA KUMARI. AJG-184576

సర్వీసెస్

- O.P. Chambers Available for Dermtaologist / Medical Oncologist / Gynecalogist in Famous Hospital, Guntur. 24X7 I.C.U, O.T and advance cathlab facilites, Contact : 8069425791 AJG-184691

ఆయుర్వేదం

- అంగస్తంభన లేకపోవటం, సెక్స్‌లో ఎక్కువసేపు చేయలేకపోవడం, అంగం లావుగా, దృఢంగా, బలంగా ఉండుటకు మూలికౌషధం. వయస్సు పైబడిన వారు కూడా వాడవచ్చు. డా.సిహెచ్.రామకృష్ణ. VJA. సెల్ : 84650 56299 AJB-1038


ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనల కొరకు ఈ క్రింది నెంబరును సంప్రదించగలరు 99854 03281 సమయం : ఉ॥ 10:00 గం॥ల నుండి సా॥ 06:00 గం॥ల వరకు (సోమవారం నుండి శనివారం వరకు)

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు. మేనేజర్ - ఏడిసిటి

సదా మీ సేవలో

అచిరకాలంలోనే అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతి కి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా!



ఈ ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి చెపితే చాలు మా సిబ్బంది తక్షణం మీకు పత్రిక అందే ఏర్పాటు చేస్తారు. అంతేకాదు, పత్రిక పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్నా, యెడల నిస్సంకోచంగా ఫోన్ చేసి చెప్పవచ్చు, మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా ఉంటారు

గుంటూరు 1 టౌన్	97036 18725
గుంటూరు 2 టౌన్	98854 01056
తెనాలి	99854 11202
నరసరావుపేట	99854 11206
బాపట్ల	99663 35084
పిడుగురాళ్ల	93909 05725
మంగళగిరి	93986 73618
అమరావతి	95027 86195
పొన్నూరు	97042 99094
రేపల్లె	99854 12254
చిలకలూరిపేట	99639 84109
వినుకొండ	99662 50266
మాచర్ల	88861 19952
సత్తెనపల్లి	91103 23914
ప్రత్తిపాడు	63004 34285

సర్కులేషన్ మేనేజర్ 99854 11214

ఇట్లు : బ్రాంచ్ మేనేజర్

పల్నాడు వార్తలు

ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తా

● నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ



గోళ్ళపాడు మాజీ సర్పంచ్ ఒబ్బాని కుమారికి టీడీపీ కండువా కప్పుతున్న కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, మార్చి 18: సత్తెనపల్లి నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తానని సత్తెనపల్లి టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. ముప్పాళ్ళ మండలం గోళ్ళపాడు మాజీ సర్పంచ్ ఒబ్బాని కుమారి సోమవారం వైసీపీ నుంచి కన్నా లక్ష్మీనారాయణ సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా కన్నా ఆమెకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. 19వ వార్డుకు చెందిన 20 మంది దళితులు కూడా వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. వారికి కన్నా కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చౌట శ్రీనివాసరావు, ముప్పాళ్ళ మండల అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు, నాయకులు ఆతుకూరి నాగేశ్వరరావు, మారెళ్ళ మల్లేశ్వరరావు, మామిడి వెంకటేశ్వరరావు, బత్తుల ఆదినారాయణ, మారెళ్ళ స్వామి, నూర్‌బాషా జానీబాబు, కే శ్రీనివాసరావు, కారుమంచి కొండయ్య, చేపూజి జయరావు, ఇజ్రాయేలు పాల్గొన్నారు.

ప్రజాగళం విజయంపై హర్షం

బెల్లంకొండ, మార్చి 18: చిలకలూరిపేట వద్ద ప్రధానమంత్రి నరేంద్రమోదీ, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ నిర్వహించిన ప్రజాగళం విజయవంతంపై రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్ హర్షం ప్రకటించారు. సోమవారం బెల్లంకొండ టీడీపీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాగళం సభకు బెల్లంకొండ మండలం నుంచి భారీ ఎత్తున టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలిరావడం సంతోషంగా ఉందన్నారు. సభ విజయవంతమైందని, రాబోయేది కూటమి ప్రభుత్వమేనని ఆయన అన్నారు. తెలుగుదేశం పార్టీ కూటమి అధికారంలోకి రావటం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు. పెదకూరపాడు నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థిగా బాష్యం ప్రవీణ్‌ను గెలిపించేందుకు ప్రతిఒక్కరు కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, బెల్లంకొండ సర్పంచ్ గడ్డిపర్తి జ్యోతి సముద్రం, మండల కోర్ కమిటీ సభ్యులు వెన్నా సీతా రామిరెడ్డి, బీసీ సంఘం అధ్యక్షులు గుంజా గంగారావు, మాజీ సర్పంచ్ సయ్యద్ జానీ, పీఎస్‌కే రసూల్, తెలుగు యువత అధ్యక్షుడు సలాం, ఎన్ పిచ్చయ్య, ఓర్సు రాంబాబు, టీడీపీ నాయకులు, కార్య కర్తలు పాల్గొన్నారు.

వైసీపీ నేతల గళం మూగబోయింది

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కను మూరి బాజిచౌదరి

సత్తెనపల్లి, మార్చి 18: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఆధ్వర్యంలో చిలకలూరిపేట వద్ద జరిగిన ప్రజగళం బహిరంగ సభ విజయవంతం కావటంతో రాష్ట్రంలో వైసీపీ నేతల గళం మూగబోయిందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనుమూరి బాజిచౌదరి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీఎం జగన్ అన్ని సామాజిక వర్గాలను ఆర్థికంగా దెబ్బతీశారన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకుండా నిరుద్యోగులను ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేసిందన్నారు. జగన్ అరాచక పాలనపై అలుపెరగని పోరాటం చేస్తున్న చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్‌కు తోడుగా, ఆంధ్రులకు అండగా నరేంద్రమోదీ రావటంతో ప్రజలు సంబరాలు చేసుకుంటున్నారన్నారు. సైకో పాలనను గద్దె దిచ్చేందుకు ప్రజల అకాంక్షకు అనుగుణంగా కూటమి పని చేస్తుందన్నారు. రాబోయేది తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఉమ్మడి ప్రభుత్వమే అన్నారు.

కంసలోరి కుంటలో గ్రావెల్ అక్రమ క్వారియింగ్



కుంటలో అర్ధరాత్రి గావెల్ తవ్విన ప్రదేశం. రహదారికి తరలించిన గ్రావెల్ కుప్పలు

అమరావతి, మార్చి 18: మండలపరిధిలోని మునగోడు గ్రామంలో గల కంసలోరి కుంటలో స్థానిక వైసీపీ నాయకులు రాత్రి వేళల్లో గ్రావెల్‌ను అక్రమంగా క్వారీయింగ్ చేసి అమ్ముకుని జేబులు నింపుకుంటున్నారు. వందల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా క్వారియింగ్ చేసిన గ్రావెల్‌ను నూతనంగా నిర్మిస్తున్న అమరావతి క్రో సూరు రహదారికి తోలుతున్నారు. అంతేగాక గ్రామంలోకి కూడా ట్రాక్టర్ల ద్వారా గ్రావెల్ తరలించి అమ్ముకుంటున్నారు. ఈ విషయమై స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చినప్పటికి అది మా పని కాదని రెవెన్యూ వారికి చెప్పుకోమని తెలియజేసినట్లు గ్రామస్థులు చెబుతున్నారు. ఎన్నికల కోడ్ వచ్చినప్పటికి అధికార పార్టీ నాయకుల గ్రావెల్ అక్రమ క్వారియింగ్ యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. గేదెలకు తాగునీరు అవసరాల కోసం వినియోగించే ఈ కుంటలో ఎక్స్‌వేటర్ ద్వారా గుంతలు తీయడంతో భవిష్యత్తులో గేదలు ప్రమాదం భారిన పడే అవకాశం ఉందని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు.

రెండు ద్విచక్ర వాహనాల ఢీ.. నలుగురికి గాయాలు

బెల్లంకొండ, మార్చి 18: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో నలుగురికి తీవ్రగాయాలైన సంఘటన బెల్లంకొండ మండలంలోని మాచాయపాలెం ఆర్‌అండ్‌ఆర్ రోడ్డు సెంటర్లో ఆదివారం రాత్రి జరిగింది. ఈ సంఘటనలో మహేష్, కృష్ణకుమారి, మమత, గుణశేఖర్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. సేకరించిన వివరాల ప్రకారం బెల్లంకొండ నుంచి రాజుపాలెం మండలం చౌట పాపాయపాలెం గ్రామానికి వెళ్తున్న మహేష్, కృష్ణకుమారి అదే సమయంలో అదే గ్రామానికి చెందిన మురళీకృష్ణ ఆర్‌అండ్‌ఆర్ సెంటర్ వద్దకు రాగానే రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనగా నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. అందులో ఐదు సం వత్సరాల బాలుడు గుణశేఖర్‌కు తీవ్ర గాయాలు కావటంతో గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. 108 వాహన పైలెట్ మస్తాన్‌వలి, ఈఎంటీ అన్నవరపు గోపీ వెంటనే స్పందించటంతో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదని బాధితులు తెలిపారు.

బహిరంగ ప్రకటన

మా క్లయింట్ శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్, చిలకలూరిపేట బ్రాంచ్ వారి సూచనల మేరకు ... దాసిశెట్టి రాఘవమ్మ గారి ప్రథమ కుమారుడు దాసిశెట్టి రాజేష్ కుమార్, ద్వితీయ కుమారుడు దాసిశెట్టి రమేష్ కుమార్ ... [illegible]

షెడ్యూలు-1: గుంటూరు జిల్లా, నరసరావుపేట ఆర్.డి., చిలకలూరిపేట సబ్.డి., ... [illegible] DOC NO: 1272/2018, S.R.O. చిలకలూరిపేట.

షెడ్యూలు-2: గుంటూరు జిల్లా, నరసరావుపేట ఆర్.డి., చిలకలూరిపేట సబ్.డి., ... [illegible] DOC NO: 1644/2019, S.R.O. చిలకలూరిపేట.

షెడ్యూలు-3: గుంటూరు జిల్లా, నరసరావుపేట ఆర్.డి., చిలకలూరిపేట సబ్.డి., ... [illegible] DOC NO: 3539/2019, S.R.O. చిలకలూరిపేట.

షెడ్యూలు-4: గుంటూరు జిల్లా, నరసరావుపేట ఆర్.డి., చిలకలూరిపేట సబ్.డి., ... [illegible] DOC NO: 1653/2017, S.R.O. చిలకలూరిపేట.

లంకా విజయ్‌కుమార్, లంకా వంశీక్రిష్ణ, న్యాయవాదులు,
2వ లైను, రవీంద్ర నగర్, గుంటూరు. సెల్ నెం.9030595227, 9848052914

ఎన్నికల నిబంధనలు బేఖాతరు

● ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటికీ..
● దర్శనమిస్తున్న సీఎం జగన్ బొమ్మలు
● సచివాలయాల్లో దర్శనమిస్తున్న నవరత్నాల పోస్టర్లు, స్టిక్కర్లు



రాజుపాలెం మండలం బలిజేపల్లిలో హోర్డింగ్‌పై వైఎస్సార్ ఆరోగ్యశ్రీ బోర్డు



ఉప్పలపాడులో పాత సచివాలయ భవనంపై ఉన్న నవరత్నాల చిత్రం



పులిపాడు సచివాలయంలో మానమ్మకం నువ్వే జగన్ పోస్టరు

గురజాలటౌన్, మార్చి 18: రెండు రోజుల క్రితమే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది.. ఇక్కడి అధికారుల అధికారుల అలసత్వమో.. అవగాహన లోపమో తెలీదు గానీ పలు సచివాలయాల్లో సోమవారం కూడా నవరత్నాలు పోస్టర్లు, స్టిక్కర్లు దర్శనమిస్తూనే ఉన్నాయి.. మండలంలోని పులిపాడు 1, 2 సచివాలయాల బయట నవరత్నాలు బోర్డులు, లోపలి వైపున మా నమ్మకం నువ్వే జగనన్న పోస్టర్లు, స్టిక్కర్లు కనిపిస్తున్నాయి. వైఎస్సార్ పింఛన్, చేయూత పోస్టర్లు కూడా దర్శనమిస్తున్నాయి. సచివాలయాలతో పాటు రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ కేంద్రాలకూ జగన్మోహన్‌రెడ్డి ఫోటోలు తొలగించలేదు. అలాగే మండలంలోని దైదలో ప్రజలకు తాగునీటిని అందించే ట్రాక్టర్లకూ వైసీపీ స్టిక్కర్లు ఉన్నాయి. జనార్థనపురంలోనూ మా నమ్మకం నువ్వే జగనన్న లైటింగ్ బోర్డులు సెంటర్లో కన్పిస్తున్నాయి. ఎన్నికల కోడ్ అమలు కాకపోతుండడంతో విమర్శలు వెలువెత్తుతున్నాయి.



దైదలో నీటి ట్యాంకరుకు వైసీపీ స్టిక్కర్లు

రాజుపాలెం మండలంలో..

రాజుపాలెం, మార్చి 18: ఎన్నికల సంఘం కోడ్ అమల్లోకి తెచ్చినప్పటికీ రాజుపాలెం మండలంలో పూర్తిస్థాయిలో ఎన్నికల కోడ్ అమలుకావడం లేదు. మండలంలోని ఆకులగణపవరం, రాజుపాలెం, బలిజేపల్లి, ఉప్పలపాడు, ఇనిమెట్ల తదితర గ్రామాల్లో ఇప్పటికీ చాలా చోట్ల సీఎం జగన్ ముఖచిత్రంతో ఉన్న నవరత్నాల ఫోటోలు దర్శనమిస్తున్నాయి. రాజుపాలెంలో రేల్వే గేటు వద్ద, సచివాలయం శంకుస్థాపన శిలాఫలకం, ఉప్పలపాడు గ్రామ నడిబొడ్డున ఉన్న పాత సచివాలయ భవనంపై, బలిజేపల్లిలో హోర్డింగ్‌పై, ఆకులగణపవరంలో ఉన్న పంచాయతీ కార్యాలయంపై వైసీపీ రంగులు ఇంకా దర్శనమిస్తున్నాయి.

ప్రశాంతంగా పది పరీక్షలు ప్రారంభం

కారంపూడి, మార్చి 18: పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభించారు. కారంపూడిలోని పదో తరగతి పరీక్ష కేంద్రం బ్రహ్మనాయుడు జిల్లా పరిషత్ పాఠశాలను సోమవారం జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు ఉండకుండా చూసుకోవాలన్నారు. విద్యార్థులకు తాగునీరు, మెడికల్ క్యాంపు తదితర వసతులను సమకూర్చామన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. జేసీ వెంట ఎంపీడీవో గంటా శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ జయవర్ధన్, హెచ్‌ఎం అనంతశివ తదితరులు ఉన్నారు.



పరీక్షా కేంద్రానికి చేరుకున్న విద్యార్థులు



కారంపూడిలోని పరీక్ష కేంద్రం తనిఖీలో పాల్గొన్న జేసీ శ్యాం ప్రసాద్

మాచవరం, మార్చి 18: మాచవరంలో సోమవారం నుంచి ప్రారంభమైన పది పరీక్షలకు 19మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈవో శ్రీధర్ తెలిపారు. జిల్లా పరిషత్ హైస్కూల్లో 337 మందికి గాను ఐదుగురు గైర్హాజరు కాగా, జీకే పబ్లిక్ స్కూల్లో 207మందికి గాను 14 మంది గైర్హాజరైనట్లు ఆయన తెలిపారు.

వెల్దుర్తి, మార్చి 18: మండలంలోని వెల్దుర్తి రంగనాథాచార్య జిల్లా పరిషత్ హైస్కూల్లో 240 మంది విద్యార్థులకు గాను 236 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. శిరిగిరిపాడు జడ్పీహెచ్‌ఎస్‌లో 184 మందికిగా 173 మంది పరీక్ష రాసినట్లు ఎంఈవో కాంతారావు తెలిపారు.

దుర్గి, మార్చి 18: దుర్గిలోని జిల్లా పరిషత్ హైస్కూల్, మోడల్ స్కూల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. 499 మంది విద్యార్థులకు గాను 482 మంది పరీక్షలు రాసినట్లు ఎంఈవో బెంజిమెన్ తెలిపారు.

రెంటచింతల, మార్చి 18: సోమవారం నిర్వహించిన టెన్త్ పరీక్షలకు 9 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈవో 2 శివ నాగేశ్వరరావు చెప్పారు. మొత్తం 4 సెంటర్లల్లో నిర్వహించిన పరీక్షకు 740 మందికి గాను 731 మంది హాజరయ్యారన్నారు.

అమరావతి, మార్చి 18: అమరావతిలో మూడు కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. మండల పరిధిలో 591మంది విద్యార్థులు పరీక్ష కు హాజరుకావాల్సి ఉండగా తొలిరోజు శ్రీరామ కృష్ణ హిందూ హైస్కూల్లో 278మంది, బాలికల గురుకుల పాఠశాలలో 299 మంది, అగస్టీన్ హైస్కూల్లో ముగ్గురు హాజరైనట్లు ఎంఈవో తెలిపారు.

పెదకూరపాడు, మార్చి 18: మండల పరిధిలో పలు గ్రామాల్లోని ఆయా పాఠశాలల వద్ద పదో తరగతి పరీక్షలు ప్రారంభమైనాయి. మండలంలోని 75త్యాళ్లూరు, పెదకూరపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో 219, 260, సెయింట్ ఆన్స్ పాఠశాలలో 98మంది పరీక్షకు హాజరైనట్లు ఎంఇఓ ఏకుల ప్రసాదరావు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలు చేసినట్లు ఎస్ఐ వివెంకట్రావు తెలిపారు.

కన్నుల పండుగగా నీలకంఠేశ్వరుని కల్యాణం



కల్యాణోత్సవంలో పాల్గొన్న డాక్టర్ యరగూటి సాంశివారెడ్డి, అన్నపూర్ణ దంపతులు

నకరికల్లు, మార్చి 18: మండలంలోని కుంకలగుంటలో ఉన్న గంగా భ్రమరాంబ సమేత నీలకంఠేశ్వర స్వామి కల్యాణం సోమవారం కన్నుల పండుగగా జరిగింది. ప్రతి ఏడాది ఆరుద్ర నక్షత్రం రోజున ఈ కల్యాణం నిర్వహిస్తున్నారు. గుంటూరు సాయి బాస్కర్ హాస్పిటల్ సీఈవో డాక్టర్ సాంబశివారెడి, అన్నపూర్ణ దంపతులు, కుంకలగుంట పీహెచ్‌సీత మాజీ చైర్మన్ కనుమూరి సాంబశివరావు, అరుణ దంపతులు పాల్గొన్నారు.



చిలకలూరిపేట ప్రజాగళం సభ ముగింపు అనంతరం ప్రధాన మంత్రి నరేంద్రమోదీని కలిసి అభివాదం చేస్తున్న కన్నా లక్ష్మీనారాయణ

ఎస్టీయూ(డీ)మండల కార్యవర్గ ఎన్నిక

అమరావతి, మార్చి 18: ఎస్టీయూ(డీ)మండల నూతన కార్యవర్గ ఎన్నిక సోమ వారం స్థానిక ఉర్దూస్కూల్లో జరిగింది. కార్యక్రమానికి కె.సాంబశివరావు అధ్యక్షత వహించారు. గౌరవ అధ్యక్షుడిగా డి.కోటేశ్వరరావు, అధ్యక్షుడిగా జి.ఆనందరావు, ఉపాధ్యక్షుడిగా ఎస్‌కే జావేద్, కార్యదర్శిగా కె.సాంబశివరావు, ఆర్థిక కార్యదర్శిగా ఎం అంకాలు, సహాయ కార్యదర్శులుగా షేక్ ఖైరున్నిసా, మహిళా కార్యదర్శిగా వేణుకు మారి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధానకార్యదర్శి జంగం కోటేశ్వరరావు, ఆర్థిక కార్యదర్శి ఏ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కోడెల కుటుంబానికి అండగా ఉంటాం

● ఎమ్మెల్సీ చిరంజీవి



కోడెల శివరాంతో ఎమ్మెల్సీ చిరంజీవి

సత్తెనపల్లి, మార్చి 18: టీడీపీ నేత డాక్టర్ కోడెల శివరాంను సోమవారం సత్తెనపల్లిలో పార్టీ అధిష్టానవర్గం దూతగా ఎమ్మెల్సీ చిరంజీవిరావు కలిశారు. టీడీపీ ఉన్నంత కాలం కోడెల కుటుంబానికి అండగా ఉంటామని ఆయన చెప్పారు. పార్టీలో కోడెల శివరాంకు సముచిత స్థానం కల్పించటంతో పాటు కుటుంబసేవలను పార్టీ కోసం పూర్తిగా వినియోగించుకుంటామని తెలిపారు. చంద్రబాబునాయుడు మాటగా శివరాంకు చిరంజీవిరావు పలు విషయాలను తెలియజేశారు. ముందుగా పార్టీ కార్యకర్తలతో కలిసి కోడెల చిత్రపటానికి చిరంజీవిరావు పూలమాల వేసి నివాలర్పించారు.

చదివింది తెలుగు.. పేపరేమో హిందీ

● అయోమయంలో టెన్త్ విద్యార్థిని

కారంపూడి, మార్చి 18: పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని ప్రియాంకబాయి సోమవారం పదో తరగతి పరీక్షలు రాసేందుకు పరీక్ష కేంద్రం ఏపీ మోడల్ స్కూల్‌కు వెళ్లింది. పరీక్ష హాల్లో తనకు ఇన్విజిలేటర్ ఇచ్చిన ప్రశ్నపత్రం హిందీ కావడంతో ప్రియాంకబాయి అయోమయినికి గురైంది. తాను తెలుగు రాయాల్సి ఉందని, హిందీ ఇచ్చారంటూ ఇన్విజిలేటర్ దృష్టికి తీసుకెళ్లింది. అయితే ఆ బాలిక హాల్ టికెట్ పరిశీలించిన ఇన్విజిలేటర్, అధికారులు నీ హాల్ టికెట్‌లో హిందీ అని ఉందని, అందుకే హిందీ ప్రశ్నపత్రం ఇచ్చామని చెప్పారు. ఏం చేయాలో పాలుపోక ఆ విద్యార్థిని పరీక్ష సమయం ముగిసే వరకు హాల్లోనే కూర్చుండిపోయింది. తనకు తెలుగు పేపరు కాకుండా హిందీ పేపరు ఇచ్చారంటూ ఆవేదన చెందింది. కాగా దీనిపై కస్తూర్బా ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా ఎస్ఎస్‌సీ బోర్డులోనే పొరపాటు జరిగి ఉంటుందని బావిస్తున్నట్లు చెప్పారు.

కూటమి విజయానికి పార్టీ శ్రేణులు ఐక్యంగా పనిచేయాలి

● జనసేన నియోజకవర్గ సమన్వయకర్త బొర్రా వెంకట అప్పారావు

సత్తెనపల్లి, మార్చి 18: రానున్న ఎన్నికల్లో జనసేన, టీడీపీ, బీజేపీ విజయానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఐక్యంగా పని చేయాలని జనసేన నియోజకవర్గ సమన్వయకర్త బొర్రా వెంకట అప్పారావు పిలుపునిచ్చారు. పార్టీలో తాను నిర్వహించాల్సిన భవి ష్యత్తు కార్యాచరణపై పార్టీ నాయకులు, కార్యకర్తలతో చర్చించారు. భవిష్యత్తు కార్యాచరణపై పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌తో మాట్లాడి బొర్రా వెంకట అప్పారావు నిర్ణయం తీసుకోవాలని పలు వురు పార్టీ నేతలు, కార్యకర్తలు సూచించారు. ఇంకా వివిధ అంశాల పై సమావేశంలో చర్చించారు. సమావేశంలో బొర్రా వెంకట అప్పారావుతో పాటు కొమ్మిశెట్టి వెంకట సాంబశివరావు, రంగిశెట్టి సుమన్, నాదెండ్ల నాగేశ్వరరావు, తాడువాయి లక్ష్మి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు పెదకూరపాడులో టీడీపీ జనసేన బీజేపీ సమావేశం

పెదకూరపాడు, మార్చి 18: ఈనెల 19వ తేది మంగళవారం మండల స్థాయి టీడీపీ జనసేన, బీజేపీల సమావేశం జరుగుతుందని టీడీపీ మండల అధ్యక్షుడు అర్తిమళ్ల రమేష్ సోమవారం తెలిపారు. ఈ సమావేశానికి టీడీపీ నియోజకవర్గ అభ్యర్థి భాష్యం ప్రవీణ్ పాల్గొంటారని మండలంలోని టీడీపీ శేణులు రాష్ట్ర జిల్లా మండల స్థాయి నాయకులు కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు అందరూ పాల్గొనాలని ఆయన కోరారు.

శ్రీరాములు కుటుంబ సభ్యులకు కన్నా పరామర్శ

నకరికల్లు, మార్చి 18 : టీడీపీ సీనియర్ నాయకుడు గోపిరెడ్డి శ్రీరాములు కుటుంబసభ్యులను సత్తెనపల్లి నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ సోమవారం పరామర్శించారు. శ్రీరాము లు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కన్నాతో పాటు టీడీపీ జిల్లా అధ్యక్షుడు నాగోతు శౌరయ్య, డాక్టర్ సింగరాజు సాయి కృష్ణ, స్థానిక టీడీపీ నేతలు పాల్గొన్నారు.

మాజీ మేయర్ కన్నా నివాళి

రాజుపాలెం, మార్చి 18: మండలంలోని ఉప్పలపాడు గ్రామానికి చెందిన దుడ్డు నరిగమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. అదేవిధంగా కొత్త బోధనం గ్రామానికి చెందిన మెరుగు జోమలయ్య అనారోగ్యం తో సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఈ విష యం ఆయా గ్రామాలకు చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుల ద్వారా తెలుసుకున్న టీడీపీ, జనసేన, బీజేపీల ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ తనయులు, గుంటూరు నగర మాజీ మేయర్ నాగ రాజు సోమవారం ఆయా గ్రామాలకు వచ్చి మృతదేహాలకు పూల మాలలు వేసి నివాలర్పించారు. ఆయన వెంట మండల టీడీపీ అధ్యక్షుడు పల్లపాటి పెద్దిరాజు, వాణిజ్య విభాగం మండల అధ్యక్షుడు తోట శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ దుడ్డు అప్పారావు, సులగా వెం కట అప్పారావు, మాజీ ఎంపీటీసీ పల్లపాటి తదితరులు ఉన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

మాచర్లటౌన్, మార్చి 18: కుటుంబ కలహాల నేపథ్యంలో వివాహిత ఆత్మహత్యాయత్నం చేసిన సంఘటన సోమవారం పట్టణంలో జరిగింది. పట్టణంలోని పాతూరు యాదవ బజారుకు చెందిన కామనబోయిన భారతి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. అనంతరం తన తండ్రి చంద్రయ్యకు ఫోన్ చేసి తన పిల్లలు జాగ్రత్త అని చెప్పింది. మాచర్ల మండలంలోని జమ్మలమడక గ్రామంలో ఉన్న చంద్రయ్య వెంటనే తన కుమార్తె భారతి నివాసముంటున్న గృహానికి చేరుకున్నారు. చికిత్స నిమిత్తం కుమార్తెను పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్సను అందిస్తున్నారు. తన అల్లుడు అమరకాశయ్య, అతని కుటుంబసభ్యులు తన కుమార్తెను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు వైద్యశాలకు చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు.

గ్రామాల్లో పోలీసు కవాతు

దాచేపల్లి, మార్చి 18: రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు కవాతు నిర్వహించారు. సోమవారం దాచేపల్లి సీఐ సురేంద్ర బాబు ఆధ్వర్యంలో తంగెడ, ముత్యాలంపాడు గ్రామాల్లో పోలీసులు, సీఆర్‌పీఎఫ్ బలగాలు ప్రత్యేక కవాతు నిర్వహించారు. పెదగార్లపాడు, కేశానుపల్లి, రామాపురం, తంగెడ, మాదినపాడు, నడికూడి, ముత్యాలంపాడు గ్రామాల్లో పోలీసులు ప్రత్యే క దృష్టి సారించారు.

ఆంధ్రజ్యోతి
దినపత్రికలో అన్ని రకముల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
సంప్రదించండి: 99854 11225 | 99854 01330 | 99854 01690 | 99854 77867

గ్రామాల్లో ఎంపీ లావు బృందం సభ్యుల పర్యటన

రెంటచింతల, మార్చి 18: మండలంలోని వివిధ గ్రామాల్లో సిట్టింగ్ ఎంపీ టీడీపీకి చెందిన లోక్‌సభ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయల బృంద సభ్యులు కొన్ని రోజులుగా విస్తృతంగా పర్యటిస్తున్నారు. లావు ఐదేళ్ల ఎంపీ పదవీ కాలంలో చేపట్టిన అభివృద్ధి పనులను వివరిస్తున్నారు. ఏఏ గ్రామాల్లో ఎవరి ఆధిపత్యం ఉంది..? ఓటర్ల సంఖ్య, తదితర సమాచారాన్ని సేకరిస్తున్నారు. అంతే గాకుండా వివిధ పార్టీల నేతలను కూడా కలుస్తున్నారు. అవసరమైతే నేరుగా ఎంపీతో ఫోన్లో మాట్లాడించినట్లు సమాచారం. మీ స్థాయికి తగ్గట్టుగా పార్టీలో ప్రాధాన్యం ఉంటుందని ఎంపీ హామీనిచ్చారు. 2019 ఏప్రిల్ 11న నిర్వహించిన ఎన్నికల్లో మండలంలో లావుకు సుమారు 5600కు పైగా మెజార్టీ వచ్చింది. ఈనెల 15న ఎమ్మెల్యే అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు రోడ్‌షో నిర్వహించారు. అనంతరం మూడు పార్టీల నేతల సమావేశంలో వారు మాట్లాడుతూ ఏపీ అభివృద్ధి జరగాలంటే చంద్రబాబునాయుడు సీఎం కావాల్సిన ఆవశ్యతను ఆయన నొక్కి చెప్పారు.

శాలివాహనుల సమస్యలను పరిష్కరిస్తా..

● టీడీపీ లోక్‌సభ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు



ఎంపీ లావుకు వినతిపత్రాన్ని అందజేస్తున్న శాలివాహన సంఘ నేతలు

శాలివాహనులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వారు కోరిన కోర్కెలు చాలా సమంజసమైనవని నరసరావుపేట టీడీపీ లోక్‌సభ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. సోమవారం శాలివాహన సాధికార సంఘ కన్వీనర్, టీడీపీ మండల ఉపాధ్యక్షుడు నారాయణపురం శ్రీనివాసరావు నేతృత్వంలో పలువురు నరసరావుపేట వెళ్లి ఎంపీ లావుకు వినతిని అందచేశారు. 25 సెంట్ల స్థలం కేటాయించి కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టాలని, సబ్సీడీ రుణాలు మంజూరు చేయాలని, నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యత కల్పించాలని ఆ వినతిలో కోరారు. ఎంపీ లావును కలిసిన వారిలో శాలివాహన పార్లమెంట్ అధ్యక్షుడు ఆరేపల్లి ఏడుకొండలు, బలిజేపల్లి శ్రీనివాసరావు, సన్నెగంటి సిద్ధయ్య, పవన్‌కుమార్, మల్లికార్జున తదితరులున్నారు.

టీడీపీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్‌కు ఘన స్వాగతం

● జనసేన, బీజేపీ నాయకులతో ఆత్మీయ సమావేశం



జనసేన, బీజేపీ నాయకులను పరిచయం చేసుకుంటున్న భాష్యం ప్రవీణ్

క్రోసూరు, మార్చి 18: పెదకూరపాడు నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్‌కు సోమవారం క్రోసూరులో ఘనస్వాగతం లభించింది. యర్రబాలెం నుంచి వందలాదిమంది టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు ర్యాలీతో ఆయనను క్రోసూరు తీసుకువచ్చారు. క్రోసూరు షాధిఖానాలో జనసేన, బీజేపీ, టీడీపీ కార్యకర్తలతో ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఏవరికి ఏ ఆవసరం వచ్చినా ఎప్పుడైనా తనను సంప్రదించవచ్చునని, ఎల్లప్పుడు అందుబాటులో, అండగా ఉంటానని భరోసా కల్పించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన మూడు శ్రేణులతో ఆత్మీయ ఆలింగనాలు చేసుకొని ఫోటో తీయించుకున్నారు. కార్యకర్తలందరికి విందు ఏర్పాటు చేశారు. పెద్దసంఖ్యలో మూడు పార్టీల శ్రేణులు నాయకులు, గ్రామ పార్టీల అధ్యక్షులు, సర్పంచులు, వార్డు మెంబర్లు, అన్ని స్థాయిల నాయకులు ఆయనను కలుసుకొని విజయానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

స్వేచ్ఛాయుత వాతావరణం కల్పిస్తాం

● రిటర్నింగ్ అధికారి శ్యాంప్రసాద్

మాచర్లటౌన్, మార్చి 18: ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ఓటు హక్కు వినియోగించుకునేలా స్వేచ్ఛాయుత వాతావరణం కల్పిస్తామని మాచర్ల నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జేసీ శ్యాంప్రసాద్ అన్నారు. స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున రాజకీయ పార్టీల నేతలు ముందస్తు అనుమతితో ప్రచారాలు, సభలు నిర్వహించుకోవాలన్నారు. ఓటు వేసే విధానంపై బీఎల్‌వోలు అవగాహన కల్పిస్తారన్నారు. ఓటర్లను బెదిరించినా, ప్రలోభ పెట్టినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే సమావేశాలు నిర్వహించుకోవాలన్నారు. కుల, మత, వ్యక్తిగత దూషణలకు దిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. రాజకీయ పార్టీలు ఎన్నికల నియమావళి పాటించాలన్నారు. పది వాహనాలు మాత్రమే ఉండాలన్నారు. 80 యేళ్ల పైబడిన వృద్ధులకు గృహాలకు వెళ్లి ఓటు హక్కు వినియోగించుకునేలా చూస్తామన్నారు. 18 యేళ్లు నిండిన వారికి ఓటు హక్కుల కల్పిస్తామని రిటర్నింగ్ అధికారి శ్యాంప్రసాద్ తెలిపారు.

ఎన్నికల నిబంధనలపై సమీక్ష



సమీక్ష నిర్వహిస్తున్న రిటర్నింగ్ అధికారి రమణకాంత్‌రెడ్డి

గురజాలటౌన్, మార్చి 18: ఎన్నికలు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి రమణకాంత్‌రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం పట్టణంలోని మండల రెవెన్యూ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నేతలతో ఎన్నికల నిబంధనలపై సమీక్ష నిర్వహించారు. రిటర్నింగ్ అధికారి ఎన్నికల నియమ నిబంధనలను వివరించారు. రాజకీయ నేతల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు. రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎవరైనా ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే హెల్ప్ లైన్ నంబరు: 9100118731కు సమాచారం అందించాలన్నారు. నియోజకవర్గంలోని పొందుగుల, తంగెడల వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. రాజకీయ పార్టీ నేతలు సభలు, సమావేశా లు నిర్వహించుకోవాలంటే అనుమతి తీసుకోవాలన్నారు. రాజకీయ పార్టీల నేతలు 10 వాహనాల కంటే ఎక్కువ ఉండకూడదన్నారు. ఫారం 6నమోదు చేసుకునేవారు ఏప్రిల్ 15వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చన్నారు. సమావేశంలో నియోజకవర్గ పరిధిలోని రాజకీయ పార్టీల నేతలు, అధికారులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీలు కూడా తొలగించాలి

పెదకూరపాడు, మార్చి 18: గృహాలు పార్టీ కార్యాలయాల వద్ద ఉన్న ఫ్లెక్సీలు కూడా తొలగించాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి కె.శ్రీరాములు అన్నారు. పెదకూరపాడులోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం వివిధ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా జరిగేందుకు నాయకులందరూ సహకరించాలన్నారు.

పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా రామకృష్ణారావు

మాచర్ల రూరల్, మార్చి 18: పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా గాదె రామకృష్ణారావు నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని పెన్షనర్స్ అసోసియేషన్ హాల్లో రామకృష్ణారావును దుశ్శాలువలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు నందా నరసింహయ్య, సబ్ ట్రెజరీ అధికారి రామనాయక్, రామనాథశర్మ, మద్దిరెడ్డి, నాగేశ్వరరావు, గాలీబు, పాపిరెడ్డి, చంద్రయ్య, ఈశ్వరయ్య సీతారామయ్య, అంజయ్య గౌస్ మోహిద్దీన్, వెంకటరెడ్డి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

ప్రజాగళం సభ విజయవంతం

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ

నరసరావుపేట టౌన్, మార్చి 18: తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఉమ్మడిగా నిర్వహించిన ప్రజాగళం సభ విజయవంతం అయిందని టీడీపీ నరరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. సోమవారం నరసరావుపేటలోని టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ ప్రజాగళం సభకు రాష్ట్రంలో కనీవిని ఏరుగని రీతిలో 15లక్షల మంది హాజరయ్యారన్నారు. దీనికి ప్రధాన కారణం మూడు పార్టీల కలయిక, చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్, ప్రధాని నరేంద్రమోడీ హాజరు కావడమేనన్నారు. జెండాలు వేరైనా ఎజెండా ఒక్కటే అన్నారు. రాబోయే కాలంలో వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలన్నారు. ఈ అవినీతి, దుర్మార్గ ప్రభుత్వానికి ముగింపు పలికే కార్యక్రమంలో భాగంగా ప్రధాని నరేంద్రమోడీ కూడా చిలకలూరిపేట బొప్పూడి వద్ద నిర్వహించిన ప్రజాగళం సభకు హాజరు అయ్యారన్నారు. ఉమ్మడి ప్రణాళిక ద్వారా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పారన్నారు. సభను విజయవంతానికి మూడుపార్టీల కార్యకర్తలు, నాయకులు, మహిళలు ఎంతో కష్టపడ్డారన్నారు. ప్రజాగళంకు నరసరావుపేట నుంచే 40వేలకు మందికి పైగా కార్యకర్తలు బయలుదేరి వెళ్లారన్నారు. కార్యక్రమానికి సహాయ సహకారాలు అందించిన ప్రైవేట్ స్కూల్ బస్సులు, ప్రైవేట్ కళాశాల యాజమాన్యం, ప్రైవేట్ ట్రావెల్స్ వాళ్ళకి, ఆటో డ్రైవర్లు, ఆర్టీసీ యాజమాన్యంకు ధన్యవాదాలు తెలిపారు. నరసరావుపేట నుంచి 15 వేలకు పైగా ద్విచక్రవాహనాలతో ర్యాలీ వచ్చారన్నారు. సహకరించిన అన్నిపార్టీల కార్యకర్తలు, మహిళలకు ధన్యవాదాలు తెలియజేశారు. సమావేశంలో తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ మహమ్మద్ రఫీ, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాగళం ఘన విజయం... కూటమిదే అధికారం

● టీడీపీ డాక్టర్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ కడియాల

నరసరావుపేట టౌన్, మార్చి 18: చిలకలూరిపేట నియోజకవర్గం బొప్పూడి వద్ద నిర్వహించిన ప్రజాగళం సభ ఘన విజయం సాధించిందని, కూటమిదే అధికారమని టీడీపీ డాక్టర్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జగన్‌రెడ్డి అవినీతి ప్రభుత్వాన్ని గద్దె దించాలని ఆంధ్రప్రదేశ్ నిర్ణయించుకుందని, వైసీపీ ప్రభుత్వాన్ని తరిమి కొట్టేందుకు ప్రజాగళం సభకు లక్షలలో జనం వచ్చి మద్దతు తెలిపారన్నారు. రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన వైసీపీ, కాంగ్రెస్ పార్టీలు వేరు కాదని, రెండు పార్టీలు ఒకే కుటుంబానికి చెందినవేనన్నారు. వైసీపీ మంత్రులు అవినీతిలో పోటీ పడుతున్నారని, జగన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని అర్థం అయిందన్నారు. కేంద్రప్రభుత్వం సహకారంతో టీడీపీ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును 72శాతం పూర్తిచేసిందని, 2019లో అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును అడ్డుకుందన్నారు. వైసీపీ పాలనలో ప్రాజెక్టులన్నీ అధ్వానంగా మారాయని, జగన్‌పాలన ఆర్థిక దుర్వినియోగం, అవినీతికి మారుపేరుగా మారిందన్నారు. జగన్‌రెడ్డి బొమ్మప్రచారానికి, కోర్టు కేసులకు వేల కోట్లు ఖర్చుచేసి దుబారా చేశారన్నారు. జగన్‌పార్టీని వచ్చే ఎన్నికలలో చిత్తుచిత్తుగా ఓడించకపోతే రేపు మన ప్రైవేటు ఆస్తుల్నీ, భూముల్నీ తాకట్టుపెట్టి లక్షల కోట్లు అప్పుతెచ్చి లూటీ చేస్తారన్నారు. ప్రైవేట్ భూముల తాకట్టుకోసమే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తెచ్చారన్నారు. జగన్‌రెడ్డిని ఓడించకపోతే సచివాలయమే కాదు రేపు ప్రైవేటు భూముల్నీ తాకట్టు పెడతారని అన్నారు. రాష్ట్ర ప్రజలకు సంక్షేమం, అభివృద్ధితో కూడిన సమర్థవంతమైన పరిపాలన కూటమితోనే సాధ్యమన్నారు.

అన్నవరప్పాడు కాలనీలో పోలింగ్ కేంద్రం ఏర్పాటుచేయరూ...

రొంపిచర్ల, మార్చి 18: మండలంలోని అన్నవరప్పాడు గ్రామంలో 628 ఓట్లు ఉన్నాయి. గతంలో అన్నవరప్పాడు కాలనీలోని పాఠశాలలో పోలింగ్ కేంద్రం ఉండేది. ఐతే పాఠశాలకు విద్యార్థులు లేకపోవటంతో మూసివేశారు. అది క్రమేపీ పాడుపడటంతో అక్కడి నుంచి పోలింగ్ కేంద్రాన్ని సమీపంలోని పంచాయతీ కార్యాలయానికి మార్చారు. అన్నవరప్పాడు కాలనీలోని ఓటర్లు ఇక్కడకు వచ్చి ఓటు వేయాల్సి ఉంది. అయితే పూర్వం ఉన్న పాఠశాలలోనే పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.



పతకాలు సాధించిన విద్యార్థులతో అకాడమీ నిర్వాహకులు

కరాటే పోటీల్లో పల్నాడు విద్యార్థులకు పతకాలు

నరసరావుపేట కల్చరల్, మార్చి, 18: ఈ నెల 17న గుంటూరు కరాటే బాడీ ఫిట్నెస్ అకాడమీలో జరిగిన కరాటే బెల్ట్‌టెస్ట్ పోటీలు నిర్వహించగా పల్నాడు జిల్లాకు చెందిన విద్యార్థులు సాధించినట్లు పల్నాడు జిల్లా సీనియర్ కరాటే మాస్టర్ ఎస్.శిరీష సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు, పల్నాడు జిల్లాల పరిధిలో జరిగిన ఈ పోటీలకు న్యాయనిర్ణేతగా పి.రాంబాబు వ్యవహరించారు. కాగా పర్పుల్ బెల్ట్ విభాగంలో అమూల్య, శంకర్, రమణరెడ్డిలు, బ్లూబెల్ట్ విభాగంలో రాము, జస్వంత్, తరుణ్ గున్వంత్ కుమార్, కిషోర్, దిలీప్, రాహిల్‌లు, గ్రీన్ బెల్ట్ విభాగంలో విశ్వేశ్వరరావు, రూపేష్, రాక్ స్టైల్ బెన్ని, విజయ్‌రాజు, మీరావలి, మేఘనందన్, జస్వంత్‌సాయి, ఆరెంజ్ బెల్ట్ విభాగంలో కల్యాణి, షణ్ముఖ, అభిరామ్, మణిదీప్, సుబ్రహ్మణ్యేశ్వర, విశ్వసారధిలు పతకాలు సాధించినట్లు చెప్పారు. పతకాలు సాధించిన విద్యార్థులను కరాటే అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పి.రాంబాబు, అసోసియేషన్ కార్యదర్శి జి.సాయిరామ్, ఎస్.శిరీష, ఏ.రవి, ప్రసన్న తదితరులు అభినందించారు.

కస్తూర్బా పాఠశాల లైబ్రరీకి పుస్తకాల వితరణ



కస్తూరిభా పాఠశాల గ్రంథాలయానికి పుస్తకాలు అందజేస్తున్న సాహితీ పరిషత్ కార్యదర్శి స్వర్ణ రామిరెడ్డి

నరసరావుపేట కల్చరల్, మార్చి, 18: పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల గ్రంథాలయానికి శ్రీనాథ సాహితీ పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం పుస్తకాలను అందించారు. తెలంగాణ రాష్ట్రం జహీరాబాద్‌కు చెందిన డాక్టర్ శివబాబు ఈ పుస్తకాలను అందించినట్లు సాహితీ పరిషత్ కార్యదర్శి స్వర్ణ చినరామిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అన్ని పార్టీలు ఉద్యోగుల చిరకాలవాంఛ ఓపీఎస్‌ను గుర్తించాలి

● ఎస్టీయూ పల్నాడు సీపీఎస్ కన్వీనర్ శరత్‌కుమార్

నరసరావుపేట టౌన్, మార్చి 18 : అన్నిపార్టీలు ఉద్యోగుల చిరకాలవాంఛ ఓపీఎస్‌ను గుర్తించాలని ఎస్టీయు పల్నాడు సీపీఎస్ కన్వీనర్ టీ శరత్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. సీపీఎస్ రద్దు మేనిఫెస్టోలో పెట్టాలని, త్వరలో జరగబోయే ఎన్నికలకు సిద్ధమైన రాజకీయ పార్టీలు రాష్ట్రంలో 3లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎదురు చూస్తున్న సీపీఎస్ రద్దు చేయాలన్నారు. ఓపీఎస్ అమలు చేస్తామని మేనిస్టోలో పెట్టాలని డిమాండ్ చేశారు.

బహిరంగ ప్రకటన

యిందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా పల్నాడు జిల్లా (పాత గుంటూరు జిల్లా), చిలకలూరిపేట మండలము, పోతవరం గ్రామ సర్వే నెం. 133/3ఏ1ఇ లో గల య. 3.71ట్లు శేరి మెరక భూమి, నా క్లయింటు అయిన శ్రీమతి **జాగర్లమూడి కమలమ్మ** గారికి, వారి తండ్రి గారి నుండి సంక్రమించిన ఆస్తి అయినందున వారి స్వార్జితపు ఆస్తి అయియుండి, దరిమిలా మెస్సర్స్ శ్రీ భ్రమరా ప్రాజెక్ట్స్, గుంటూరు రియల్ ఎస్టేట్ వారికి విక్రయ ఖరారు పడిన దరిమిలా సదరు శ్రీభ్రమరా ప్రాజెక్ట్స్, గుంటూరు వారు, నా క్లయింటు ఇరువురు కుమారులు కలసి మోసపూరితముగా నా క్లయింటు భర్త గారి ఆస్తిని విభాగములు చేసుకొనే నెపముతో నా క్లయింటును మోసగించి ఆమె యొక్క పైన పేర్కొన్న స్వార్జితపు ఆస్తిని ఇరువురు కుమారులకు బాగా పంపిణీలో వచ్చినట్లుగా వ్రాసుకొని దరిమిలా అందులో కొంత ఆస్తిని శ్రీభ్రమరా ప్రాజెక్ట్ వారు నా క్లయింటు పెద్ద కుమారుడి భార్య, కుమారిని నుండి విక్రయము పొందియుండి నా క్లయింటు అనుమతి లేకుండానే కన్వర్షన్ చేయించి ప్లాట్లుగా వేసి అమ్ముటకు యత్నించుచున్నట్లుగా తెలియవచ్చినది. నా క్లయింటు మోసపూరితముగా తన స్వార్జితపు ఆస్తిని పంచుకొనినట్లు వ్రాసిన దస్తావేజు మరియు భ్రమరా ప్రాజెక్ట్ వారు నా క్లయింటు గతించిన పెద్ద కుమారుడు శ్రీనివాసరావు భార్య, కుమారుని నుండి వ్రాయించుకొన్న కొనుగోలు దస్తావేజు చెల్లనిదిగా డిక్లేర్ చేయమని కోరుచూ శ్రీయుత నరసరావుపేట 13వ అదనపు జిల్లా జడ్జి గారి కోర్టు నందు **ఓ.యస్.నెం.33/2022**పుగా దావా వేసియున్న దరిమిలా సదరు దావా విచారణలో యున్నది. కనుక సదరు నా క్లయింటు ఆస్తి అయిన పోతవరం గ్రామ సర్వే నెం. **133/3ఏ1ఇ** లో గల య. **3.71**ట్లు భూమిలో శ్రీభ్రమరా ప్రాజెక్ట్ వారు వేసిన ప్లాట్లను ఎవరైనా వారి నుండి కొనుగోలు చేసిన యెడల సదరు క్రయ విక్రయములు చెల్లనేరవని ఇందు మూలముగా తెలియజేయడమైనది.

కొడాలి నాగేశ్వరరావు, అడ్వకేట్,
చిలకలూరిపేట - 522 616, మొబైల్ నెం: 98481 69280

ప్రశాంతంగా పది పరీక్షలు ప్రారంభం



నరసరావుపేటలోని మున్సిపల్ పాఠశాల వద్ద గుమిగూడిన పదో తరగతి విద్యార్థులు, తల్లిదండ్రులు

నరసరావుపేట టౌన్, మార్చి 18: పల్నాడు జిల్లాలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంత వాతారణంలో ప్రారంభం అయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 127 కేంద్రాలలో పరీక్షలు నిర్వహించారు. మొత్తం 25749 విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 25111 మంది హాజరయ్యారని డీఈవో ఎం.వెంకటేశ్వర్లు చెప్పారు. 638 గైర్హాజరు అయ్యారన్నారు. పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి లింగంగుంట్లలోని శంకరభారతిపురం పాఠశాలను సందర్శించారు. పలు తరగతి గదులను పరిశీలించి పరీక్షా సరళిని ప్రత్యక్షంగా పరిశీలించారు. చీఫ్ సూపరింటెండెంట్ పార్వతి, హెచ్‌ఎంలతో విద్యార్థులకు ఏర్పాటుచేసిన వసతులపై అడిగి తెలుసుకున్నారు. కాగా జిల్లావ్యాప్తంగా ఆర్‌జేడీ ఏడు పరీక్షా కేంద్రాలను, డీఈవో ఎం వెంకటేశ్వర్లు మూడు కేంద్రాలను సందర్శించగా, ఫ్లయింగ్ స్క్వాడ్ 80 పరీక్షా కేంద్రాలను సందర్శించారని అధికారులు తెలిపారు. మొత్తం మీద మొదటిరోజు పల్నాడు జిల్లావ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగాయని అధికారులు తెలిపారు.



లయోల పాఠశాలలో తనిఖీలకు వచ్చిన స్క్వాడ్ అధికారులు

● ఈపూరు: మండలంలోని ముప్పాళ్ళ, ఈపూరు హైస్కూల్స్‌లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డి పరీక్షా కేంద్రాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కొండ్రముట్లకు చెందిన పదో తరగతి విద్యార్థి సురేంద్ర మోటార్ బైక్‌పై ముప్పాళ్ళ పరీక్షా కేంద్రానికి వస్తూ ప్రమాదానికి గురయ్యాడు. క్షతగాత్రుడిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. మొదటిరోజు 499మందికిగాను 489మంది విద్యార్థులు హాజరయ్యారు.

● రొంపిచర్ల: మండలంలోని రొంపిచర్ల, సంతగుడిపాడు, బుచ్చిపాపన్నపాలెం, గోగులపాడు, బొగ్గరం గ్రామాల జడ్పీ పాఠశాల విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. సంతగుడిపాడు, కొత్తపల్లి, చేజర్ల, కుంకలగుంట, పాఠశాలల విద్యార్థులకు బస్సు సౌకర్యం లేక ఆటోలలో పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. వైద్యశాఖ ఆధ్వర్యంలో శిబిరాలు ఏర్పాటు చేశారు.

రొంపిచర్లలో ఆర్‌జేడీ తనిఖీ

రొంపిచర్ల, మార్చి 18: మండలంలోని రొంపిచర్ల 10వ తరగతి పరీక్షా కేంద్రాన్ని ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డి సోమవారం తనిఖీచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో ఆరు ఫ్లయింగ్, 15 సిట్టింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మూడువందల మంది విద్యార్థులు ఉన్న పరీక్షా కేంద్రంలో సిట్టింగ్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సంవత్సరం కొత్తగా పరీక్షా ప్రశ్నాపత్రంపై క్యూఆర్ కోడ్ ముద్రించినట్లు తెలిపారు. దీనివల్ల పేపర్ లీకైతే ఎక్కడి నుంచి జరిగిందో కని పెట్టవచ్చన్నారు. మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేదన్నారు. బస్సు సౌకర్యం గురించి ప్రస్తావించగా ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకువచ్చి ఆ సమస్యను పరిష్కరిస్తామన్నారు.

● యడ్లపాడు: మండలంలో 9 జడ్పీ, ఒక ఎయిడెడ్, గురుకుల పాఠశాలలతోపాటు మరో మూడు ప్రైవేటు పాఠశాలల్లో 591మంది విద్యార్థులు ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు రాసేందుకు అర్హత సాధించారు. అయితే తొలిరోజు జరిగిన తెలుగు లాంగ్వేజ్ పరీక్షకు 568మంది హాజరు కాగా ఐదుగురు గైర్హాజరయ్యారు. జడ్పీ హైస్కూల్‌లోని కేంద్రంలో 35మంది విద్యార్థులకు హాజరుకావలసి ఉండగా 15మంది గైర్హాజరయ్యారు. సెయింట్ ఆన్స్ పాఠశాలలో 276మందికి గాను ఆరుగురు, నారాయణ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో 280మందికి గాను ఇద్దరు గైర్హాజరయ్యారు. ఉదయం 9గంటలకే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకోగా గేట్ల వద్దనే విద్యార్థుల హాల్‌టిక్కెట్లను పరిశీలించి లోనికి అనుమతించారు. మూడు కేంద్రాలను పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు సందర్శించారు.

● వినుకొండ టౌన్, మార్చి 18: పట్టణంలో ప్రారంభమైన 10వ తరగతి పరీక్షలకు మొత్తం 2132మంది విద్యార్థినీ, విద్యార్థులకు గాను 2087మంది పరీక్షలకు హాజరైనట్లు ఎంఈవో జఫ్రుల్లా సోమవారం తెలిపారు. నరసరావుపేట రోడ్డులోని లయోలా పాఠశాల పరీక్ష సెంటర్‌లో స్క్వాడ్ అధికారులు తనిఖీలు చేపట్టారన్నారు.

● నాదెండ్ల: మండలంలోని మూడు కేంద్రాలలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. మొత్తం మూడు కేంద్రాలలో 544మంది పరీక్షలకు హాజరు కావలసి ఉండగా 11మంది గైర్హాజరయ్యారు. సాతులూరులో 241 మందికి గాను 7గురు, నాదెండ్ల 113 మందికిగాను ఒకరు, చిరుమామిళ్లలో 197మందికిగాను ముగ్గురు గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను ఎంఈవో-2 కృష్ణారెడ్డి పరిశీలించారు.

● శావల్యాపురం: మండలంలోని ఐదు జడ్పీపాఠశాలలో 263మంది, సప్లిమెంటరీకి 11మంది కలపి మొత్తం 274మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 263మంది పరీక్షలకు హాజరైనట్లు ఎగ్జామినేషన్ ఛీప్ సునీల్ చౌదరి తెలిపారు. వేల్పూరు, పొట్లూరు, కారుమంచి గ్రామాల నుంచి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు మూడు ఆర్టీసీ ఉచిత బస్సులను ఏర్పాటు చేశారు. వేల్పూరులోని విద్యార్థులు పాఠశాలలోని సరస్వతీదేవి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం పరీక్షలకు వెళ్లారు. ఎస్ఐ చల్లా సురేష్ బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రంలో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి రాజుపాలెం మండలం ఎంఈవో మల్లికార్జున్‌శర్మ తనిఖీలు నిర్వహించారు.



వేల్పూరులో సరస్వతీదేవికి పూజలు చేస్తున్న విద్యార్థులు

అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలి

● మాజీ ఎమ్మెల్యేలు జీవీ, మక్కెన



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యేలు జీవీ, మక్కెన

వినుకొండ, మార్చి 18: అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలని, అధికారులు ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన విషయాన్ని మర్చిపోవద్దని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సూచించారు. టీడీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు కలిసి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో సాగిన జగన్ అవినీతి, అరాచకపాలనను వ్యతిరేకిస్తూ ప్రజాగళంతో ప్రజలు సందేశం ఇచ్చారన్నారు. ప్రజలు లక్షలాదిగా తరలివచ్చి బ్రహ్మరథం పలికారని, ప్రజాగళం సభ కుంభమేళాలా దర్శనమిచ్చిందన్నారు. 12.కి.మీటర్ల దూరం వరకు ట్రాఫిక్ నిలిచిపోయిందన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టిన దుర్మార్గుడు జగన్‌ను ఎవరూ క్షమించరన్నారు. ప్రజాగళం సభలో పోలీసుల వైఫల్యం ఉందన్నారు, దేశ ప్రధాని హాజరైన సభకు పోలీస్‌ల నిర్లక్ష్యం కారణంగా ట్రాఫిక్‌జామ్‌తో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. అనంతరం మక్కెన మల్లికార్జునరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు చేసిన అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. పదేపదే 100 పడకల ఆసుపత్రి మంజూరుపై ప్రజలకు తప్పుడు హామీలు ఇచ్చారని, ఆ మంజూరు ఎక్కడో చూపాలన్నారు. ముస్లిం మైనార్టీ కాలేజి ఎక్కడో బ్రహ్మన్న సమాధానం చెప్పాలన్నారు. రింగ్‌రోడ్డు, రెండుపూటల నీరు ఎక్కడో చూపించాలన్నారు. ప్రస్తుతం మేమంతా మాజీలమే, ఎన్నికల కోడ్ వచ్చిన నాటి నుంచి బ్రహ్మనాయుడు మాజీ అయ్యారన్నారు. ప్రధానంగా రెవెన్యూ, పోలీస్ అధికారులు ప్రవర్తన మార్చుకోవాలని, ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన విషయం మర్చిపోవద్దని ఈసందర్భంగా గుర్తుచేశారు. బొల్లా ఇంటికి అధికారుల వెళుతున్నారని, దీనికి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

కార్యక్రమంలో పఠాన్ ఆయూబ్ ఖాన్ , షమీమ్, రొడ్డా వీరాంజినేయరెడ్డి, అమృతపూడి కోటయ్య బత్తుల గోవిందరాజులు, గంగినేని ఆంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ క్రీడాకారుడు అబ్దుల్లాకు గోల్డ్ మెడల్



మెడల్‌తో అబ్దుల్లా

వినుకొండ, మార్చి 18: విశాఖపట్నంలోని వి.ఎం.ఆర్.డి.ఏ పార్కులో ఆదివారం జరిగిన ఐదు కిలోమీటర్ల మారథాన్ భారత్ నీవేష్ పరుగు పందెంలో వినుకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన జాతీయ్య క్రీడాకారుడు షేక్ అబ్దుల్లా గోల్డ్ మెడల్ సాధించినట్లు సోమవారం తెలిపారు. ఈసందర్భంగా అబ్దుల్లా మాట్లాడుతూ ఒలంపిక్స్ శిక్షణకు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఆదుకునేందుకు ముందుకు వచ్చిన సినిమా నటుడు సోనూ సూద్, బుల్లితెర జబర్దస్త నటులు ముందుకు వచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఒలంపిక్స్ పోటీల్లో భారత్ తరుపున పాల్గొని గోల్డ్‌మెడల్ సాధించడమే తన జీవిత ఆశయమన్నారు.

వరికుప్ప దహనం

ఉప్పరపాలెం (ఈపూరు) మార్చి 18: మండలంలోని ఉప్పరపాలెంలో వరికుప్పకు గుర్తు తెలియని దుండగులు నిప్పుపెట్టడంతో పూర్తిగా కాలిపోయింది. గ్రామానికి చెందిన మేకల రామయ్య చెరువు కింద సుమారు ఎకరం పొలంలో వరి సాగుచేశాడు. పంటను కోసి నూర్పిడి కోసం కుప్పపెట్టాడు. సోమవారం పొలం వద్దకు వెళ్ళే సరికి వరి కుప్ప దహనమవుతోందని తెలిపాడు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు.

వినుకొండలో ఇంటింటికీ తెలుగుదేశం



కరపత్రాలు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యేలు జీవీ, మక్కెన

వినుకొండ, మార్చి 18: చంద్రన్నతోనే పేదల జీవితాలలో వెలుగులు సాధ్యమని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. పట్టణంలోని 11వార్డు రైలుపేటలో సోమవారం మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో కలసి ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రప్రగతి కోసమే టీడీపీ, జనసేన, బీజేపీపార్టీలు కలసి పొత్తు పెట్టుకొన్నాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే టీడీపీ అధినేత చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడం జరుగుతుందన్నారు. గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలోనూ, వినుకొండలోనూ అవినీతి, అక్రమాలు, భూకబ్జాలు, మాఫియాలతో దోపిడీ చేశారన్నారు. ప్రజలు గమనించి రాష్ట్ర భవిష్యత్తు కోసం వినుకొండ భవిష్యత్తు కోసం, యువత భవిష్యత్తు కోసం ప్రజా కూటమికి ఓటు వేయాలన్నారు. పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఆయూబ్‌ఖాన్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

హడావిడిగా రోశయ్య విగ్రహం పెట్టాల్సిన అవసరమేంటి

● రాష్ట్ర బీసీ యునైటెడ్ ఫ్రంట్ అధ్యక్షుడు శ్రీనివాసరావు

వినుకొండ, మార్చి 18: మాజీ సీఎం కొణిజేటి రోశయ్య విగ్రహం హడావిడిగా పెట్టాల్సిన అవసరమేంటని రాష్ట్ర బీసీ యునైటెడ్ ఫ్రంట్ అధ్యక్షుడు వేముల శ్రీనివాసరావు ప్రశ్నించారు. పట్టణంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గడిచిన ఐదేళ్ళలో గుర్తుకు రాని రోశయ్య ఎన్నికల కోడ్ వచ్చే వారం ముందు వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడడికి ఎందుకు గుర్తుకొచ్చారని ప్రశ్నించారు. ఉమ్మడి రాష్ట్రంలో రోశయ్యకు ఆరుగురు ముఖ్యమంత్రుల వద్ద ఆర్థికమంత్రిగా చేసిన అనుభవంఉందని, ఆయన్ను ఒక కులానికి ఆపాదించకూడదన్నారు. ఎమ్మెల్యే బొల్లా నియోజకవర్గంలోని వైశ్య సామాజిక ఓటర్లను ఆకట్టుకొనేందుకే రోశయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేశారని, రానున్న ఎన్నికల్లో వైసీపీ నాయకులు కులాల మధ్య చిచ్చుబెట్టి గెలవాలని చూస్తున్నారే తప్ప ప్రజా సమస్యలపై చిత్తశుద్ధి లేదన్నారు. జరుగుతున్నతంతు ప్రజలకు తెలిసినంతగా కూడా వైసీపీ నాయకులకు తెలియకపోవడం అవివేకమన్నారు.

వేసవి క్రీడా శిక్షణ శిబిరానికి దరఖాస్తుల ఆహ్వానం

నరసరావుపేట కల్చరల్, మార్చి, 18: ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ వారి ఆదేశాల మేరకు ఈ విద్యా సంవత్సరం వేసవి నందు క్రీడా శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు పల్నాడు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి జి.సురేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మే నెల 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు జరిగే ఈ శిక్షణ శిబిరంలో పల్నాడు జిల్లాకు చెందిన 8 నుంచి 14 సంవత్సరాల వయసు గల బాలబాలికలు పాల్గొనవచ్చని చెప్పారు. ప్రతిశిబిరంలో 25మంది బాలురు, 25మంది బాలికలతో జిల్లా వ్యాప్తంగా 50శిబిర క్యాంపులు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తిగలవారు 8212622574 నెంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.



కాలువ ఆక్రమించుకొని నిర్మిస్తున్న బైపాస్ రోడ్డు సమీపంలో గృహం

కాలువను ఆక్రమించుకొని అక్రమ నిర్మాణం

● వర్షాకాలం వస్తే బీసీ కాలనీకి ఇబ్బందులే

నరసరావుపేట టౌన్, మార్చి 18: నరసరావుపేట పట్టణం బైపాస్ రోడ్డు సమీపంలో 34వ వార్డులో కాలువ ఆక్రమించుకొని గృహ నిర్మాణం చేస్తున్నారు. ఈ ఆక్రమణ వలన వర్షాకాలం వస్తే ఆ కాలువలో నీరు పొంగి, పోర్లి బీసీ కాలనీలోకి నీరు వస్తుందని బీసీ కాలనీ వాసులు వాపోతున్నారు. కాలువగట్టు పగలగొట్టి అక్రమంగా గృహనిర్మాణం చేస్తున్నప్పటికీ అధికారులకు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని బీసీ కాలనీ వాసులు విమర్శిస్తున్నారు. వాగు ఒడ్డున కొద్దిపాటి స్థలం నుంచి పైగృహాల వారికి నడక, వాహనాల రాకపోకలకు దారిఉందని, ఈ నిర్మాణంతో బీసీ కాలనీ వాసులందరికీ ఇబ్బందులు తప్పవని స్థానికులు తెలిపారు. టౌన్ ప్లానింగ్, ఇతర అధికారులు మెతుకువిద బీసీ తక్షణమే స్పందించి గృహ నిర్మాణాన్ని నిలిపివేసి న్యాయం చేయాలని బీసీ కాలనీ వాసులు వేడుకుంటున్నారు.

ఆంధ్రజ్యోతి
దినపత్రికలో అన్ని రకముల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
సంప్రదించండి: 99854 11226, 99854 11220
99852 07026

పుల్లారావుకు టీడీపీ నేతల సత్కారం



పుల్లారావును సత్కరిస్తున్న చిలకలూరిపేట టీడీపీ నేతలు

చిలకలూరిపేట, మార్చి 18: అతి తక్కువ సమయంలో టీడీపీ, జనసేన, బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగ సభ విజయవంతానికి ఏర్పాట్లు చేసిన మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావును పార్టీ నేతలు పలువురు సోమవారం రాత్రి ఆయన నివాసంలో కలిసి అభినందనలు తెలిపి, శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ చిలకలూరిపేట నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, నాదెండ్ల మండలం అధ్యక్షుడు బండారుపల్లి సత్యనారాయణ, యడ్లపాడు మండలం అధ్యక్షుడు కామినేని సాయిబాబు, చిలకలూరిపేట పట్టణ అధ్యక్షుడు పఠాన్ సమద్‌ఖాన్, పట్టణ ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, క్లస్టర్, యూనిట్ ఇంచార్జ్, బూత్ కన్వీనర్లు, వార్డు, గ్రామ అధ్యక్షుడు, పలువురు ప్రజా ప్రతినిధులు, పార్టీ నేతలు, కార్యకర్తలు ప్రత్తిపాటి పుల్లారావును కలిసి అభినందించారు.

ప్రజా సమస్యలపై టీడీపీ కౌన్సిలర్ల పోరాటం హర్షణీయం

● మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, మార్చి 18: ఎలాంటి బెదిరింపులను లెక్కచేయక ప్రజా సమస్యలపై పోరాడుతూ గెలిపించిన ప్రజల రుణం తీర్చుకోవటం హర్షణీయమని టీడీపీ కౌన్సిలర్లను మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు కొనియాడారు. సోమవారానికి కౌన్సిలర్లుగా ప్రమాణ స్వీకారం చేసి మూడేళ్ళు పూర్తయిన సందర్భంగా టీడీపీ కౌన్సిర్లు మాజీమంత్రి ప్రత్తిపాటిని కలసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టకాలంలో టీడీపీ తరఫున ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేసిన మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ గంగా శ్రీనివాసరావు, కౌన్సిలర్లు కొత్త కుమారి, జంగా సుజాత, ఆర్ అనిత, పి శివకుమారి, కంచర్ల అరుణ, కూనల ప్రమీల, కనమర్లపూడి లక్ష్మీతిరుమలను ప్రత్తిపాటి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

చిలకలూరిపేటలో అర్ధరాత్రి కలకలం

● వైసీపీ గ్రూపుల మధ్య ఘర్షణ ● అడ్డుకున్న పోలీసులు

చిలకలూరిపేట, మార్చి 18: చిలకలూరిపేట పట్టణంలో ఆదివారం అర్ధరాత్రి ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. వైసీపీలోని రెండు గ్రూపుల వారు తీవ్ర వాగ్వావాదాల అనంతరం ఇనుపరాడ్లతో ఘర్షణకు దిగారు. ఫేస్ బుక్‌లో పోస్ట్ చేసిన ఒక విషయంపై వివాదం జరిగిన నేపథ్యంలో ఈ పరిస్థితి నెలకొన్నది. మంత్రి రజిని వర్గానికి చెందిన మంత్రి పీఏ ఫణి వర్గం ఒకవైపు ఉండగా, మల్లెల రాజేష్ నాయుడు వర్గానికి చెందిన మున్సిపల్ వైస్‌చైర్మన్ గోల్డ్ శీను వర్గం మరొకవైపు ఘర్షణకు దిగారు. గోల్డ్ శీను ప్రస్తుతం మల్లెల రాజేష్ నాయుడు గ్రూపులో ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న వెంటనే అర్బన్ పోలీసులు ఆ ప్రాంతానికి వచ్చి రెండువర్గాల వారిని అక్కడ నుంచి పంపించి వేశారు. ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో అర్బన్ సీఐ పి.రమేష్ ఆధ్వర్యంలో పట్టణంలోని మూడు ప్రధాన సెంటర్లలో సోమవారం పోలీస్ పికెట్‌లు ఏర్పాటు చేశారు. ఘర్షణకు కేంద్రమైన చౌత్రా సెంటర్‌లోని ఆంజనేయస్వామి గుడి ప్రాంతం, నరసరావుపేట సెంటర్, కళామందిర్ సెంటర్ ప్రాంతాల్లో పోలీసులు పికెటింగ్ ఏర్పాటుచేశారు. కాగా ఈ సంఘటన నేపథ్యంలో ఎప్పుడు ఏం జరుగుతుందోనని పోలీసులు అప్రమత్తమయ్యారు.

అందుబాటులో పోటీ పరీక్షలకవసరమైన పుస్తకాలు

● జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సుబ్బరత్నమ్మ

నరసరావుపేట టౌన్, మార్చి 18: విద్యార్థులు గ్రంథాయాలను సద్వినియోగం చేసుకోవాలని, పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంకదారి సుబ్బరత్నమ్మ అన్నారు. సోమవారం నరసరావుపేట పట్టణంలోని పల్నాడు రోడ్డులో ఉన్న శాఖా గ్రంథాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా వంకదారి సుబ్బరత్నమ్మ మాట్లాడుతూ ఇంకా అవసరమైన పుస్తకాలను గ్రంథాలయ అధికారి వద్ద ఉన్న ఆన్‌డిమాండ్ పుస్తకంలో నమోదు చేస్తే సంబంధిత పుస్తకాలను జిల్లా గ్రంథాలయ సంస్థ నుంచి సరఫరా చేస్తామన్నారు. గ్రంథాలయ భవనాన్ని పరిశీలించి తగిన మరమ్మతులు చేయించాలన్నారు. రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ కార్యదర్శి వంకదారి సుబ్బరత్నమ్మను గ్రంథాలయ అధికారి యడ్లపాటి రాధా, సిబ్బంది సత్కరించారు.



రికార్డులను తనిఖీ చేస్తున్న సుబ్బరత్నమ్మ

గ్రంథాలయంలో రికార్డులు తనిఖీ

వినుకొండటౌన్, మార్చి18: జిల్లా గ్రంథాలయ అధికారి వంకదారి సుబ్బరత్నమ్మ పట్టణంలోని గ్రంథాలయాన్ని ఆకస్మికంగా సోమవారం తనిఖీచేశారు. త్వరలో గ్రంథాలయానికి కావలిసిన స్థలాన్ని సేకరించి, నూతన గ్రంథాలయ నిర్మాణానికి కృషిచేయడం జరుగుతుందని తెలిపారు. ఆమెవెంట గ్రంథాలయం అధికారి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం స్వాధీనం

నరసరావుపేట లీగల్, మార్చి 18: నకరికల్లు మండలం గుండ్లపల్లి గ్రామంలో 9 సీసాల అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సోమవారం నరసరావుపేట స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంటు సీఐ నయనతార తెలిపారు. నిందితురాలు సైదాబిని అదుపులోకి తీసుకుని మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఎస్పీ రవిశంకర్‌ను కలసిన సత్తెనపల్లి సీఐ శ్రీనివాసరావు

నరసరావుపేట లీగల్, మార్చి 18: ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా సత్తెనపల్లి పట్టణ సీఐ పి.శ్రీనివాసరావు బదిలీఅయ్యారు. ఈ నేపథ్యంలో సోమవారం జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డిని సీఐ పి.శ్రీనివాసరావు కలిశారు.

జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం

చిలకలూరిపేట, మార్చి 18: జాతీయ రహదారిపై బొప్పూడి చిలకలూరిపేట మధ్య ఆదివారం సాయంత్రం ప్రమా దం జరిగింది. ఒంగోలు నుంచి గుంటూ రు వెళుతున్న ఒంగోలు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ముందు వెళుతున్న ఒక కంటైనర్ లారీని ఢీకొన్నది. దీంతో బస్సు ముందువైపు భాగం బాగా దెబ్బతిన్నది. ప్రమాదంలో బస్సు డ్రైవర్ తో పాటు బస్సులో ప్రయాణిస్తున్న కొందరికి స్వల్ప గాయాలయ్యాయి. సమీపంలోని ఆసుపత్రులలో ప్రాథమిక చికిత్స అనంతరం వారందరూ వెళ్లిపోయారు. నేషనల్ హైవేస్ వారు క్రేన్ సహాయంతో బస్సును అక్కడి నుంచి తొలగించారు. అంతకుముందు ఈ ప్రమాదం కారణంగా రహదారిపై ట్రాఫిక్ చాలాసేపు నిలిచిపోయింది.

ఇర్లపాడు ఉపసర్పంచ్ మృతి

నాదెండ్ల, మార్చి 18: మండలంలోని ఇర్లపాడు గ్రామ పంచాయితీ ఉపసర్పంచ్ పూర్లె పెద్దఅంజియ్య (58) సోమవారం మృతిచెందారు. ఆయన గత కొంతకాలంగా కిడ్నీవ్యాధితో బాధపడుతున్నాడు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పెద్ద అంజియ్య మృతిపై గ్రామసర్పంచ్ మంగు రమాదేవి, గణపరవరం సొసైటీ అధ్యక్షులు మంగు ఏడుకొండలు తదితరులు సంతాపం వ్యక్తంచేశారు.

గొడవల్లో తలదూర్చి జీవితాలు నాశనం చేసుకోవద్దు

● వినుకొండ రూరల్ సీఐ సుధాకర్‌రావు

కారుమంచి (శావల్యాపురం) మార్చి 18: చదువుకున్న యువకులు ఎన్నికల గొడవల్లో తలదూర్చి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని వినుకొండ రూరల్ సీఐ ఉప్పుటూరి సుధాకర్‌రావు అన్నారు. భద్రతా బలగాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు మండలంలోని కారుమంచి, మతుకుమల్లి, బొందిలిపాలెం గ్రామాల్లో కేంద్ర బలగాలతో సోమవారం కవాతు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ కారుమంచిని సమస్యాత్మకమైన గ్రామంగా గుర్తించామని, రానున్న ఎన్నికల్లో ప్రజలంతా ప్రశాంతంగా ఓటుహక్కును వినియోగించుకోవాలని, ఎవరైనా గొడవలకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయనతో ఎస్ఐ చల్లా సురేష్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

మురికిపూడిలో రోటరీ నేత్ర వైద్య శిబిరం

చిలకలూరిపేట, మార్చి 18: చిలకలూరిపేట మండలం మురికిపూడి గ్రామంలో సోమవారం రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట వారి ఆధ్వర్యంలో నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 364 మందికి నేత్ర వైద్య పరీక్షలు జరిపి 63 మందికి నేత్ర శస్త్ర చికిత్సల అవసరమని గుర్తించారు. గతంలో శస్త్ర చికిత్సలు చేయించుకున్నట్లు 250 మందికి కళ్ళజోళ్ళు పంపిణీ చేశారు. శంకర కంటి ఆసుపత్రి వారి సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.